
నేటి దినపత్రిక
సూర్య
ఉత్తరాంధ్ర
www.suryaa.com
సోమవారం
10-3-2025
పేజీలు 14
విశాఖ - అనకాపల్లి - అల్లూరి - మన్యం
విజయనగరం
శ్రీకాకుళం






## కార్మికులు భద్రంగా ఉంటేనే
# రాష్ట్రం భద్రం

**కార్మికుల భద్రతతోనే స్వర్ణాంధ్రప్రదేశ్ కల సాకారం**

**కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్**

**ఘనంగా 54వ జాతీయ భద్రతా వారోత్సవాలు సందర్భంగా ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, ఎమ్మెల్యే విజయ్ కుమార్**

అనకాపల్లి, మార్చి 9, మేజర్ న్యూస్

కార్మికుల భద్రతకు ప్రభుత్వమే కాదు యాజమాన్యం కూడా బాధ్యత వహించి వారికి కావాల్సిన సౌకర్యాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ కార్మిక,కర్మాగార బాయిలర్ మరియు వైద్య భీమా సర్వీసుల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. జాతీయ భద్రతా వారోత్సవాలలో భాగంగా జిల్లా కార్మిక, కర్మాగార బాయిలర్ మరియు వైద్య భీమా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎన్ టి ఆర్ స్టేడియం వద్ద నుంచి స్టేడియం నుండి పెంటకోట కన్వెషన్ సెంటర్ వరకు భద్రత పై అవగాహన ర్యాలీ ని రాష్ట్ర కార్మిక, కర్మాగార శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తో

..మిగతా 2లో



## పట్టణాల్లో.. రోడ్ల విస్తరణలో..
## టీజీఆర్‌ల జారీతోనే..
# నిర్వాసితులకు మేలు!

- భూ సేకరణ చట్టం ద్వారా పరిహారం అందిస్తే.. స్థానిక సంస్థలకు భారమే..!
- స్థల మార్కెట్ విలువ అయితే.. నిర్వాసితులకు నష్టమే!
- లోపాలను నియంత్రించి.. పారదర్శకంగా టీడీఆర్‌లు జారీ చేస్తేనే రోడ్ల విస్తరణ పనులు వేగవంతం
- ఇదే వాదనను సమర్థిస్తున్న మేధావర్గం

(సూర్య ప్రతినిధి -విశాఖపట్నం)

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పట్టణాల్లో రోడ్లు విస్తరణ చేపట్టాలంటే బదిలీ అభివృద్ధి హక్కులు (టీడీఆర్)లు అయితే.. నిర్వాసితులకు మేలు జరగడంతో పాటు పట్టణ, పురపాలక సంఘాలకు, ప్రభుత్వానికి ఎలాంటి ఆర్థిక భారం వుండదనే వాదన వుంది. పురపాలక సంఘాలు, ప్రభుత్వంపై ఆర్థిక భారం అనేది లేకుండా.. ఎటువంటి జాప్యం లేకుండా త్వరితగతిని ఆ భూ నిర్వాసితులకు మేలు జరుగుతుందంటే టీడీఆర్ జారీ ద్వారానే అన్నది అందరికీ తెలిసిన విషయమే. ప్రస్తుతం జారీ చేస్తున్న టీడీఆర్‌లు మార్కెట్ విలువకు నాలుగు రేట్లు విలువ కలిగినవే. ఇదిలావుండగా.. ఇటీవల రాష్ట్ర అసెంబ్లీలో టీడీఆర్‌ల సర్టిఫికెట్లు వ్యవస్థనే రద్దు చేయాలని కొంతమంది ప్రజాప్రతినిధులు ప్రతిపాదనలు చేయడంపై భూ యజమానులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. భూ సేకరణ చట్టం ద్వారా తమకు న్యాయమైన పరిహారం అందదని, ప్రభుత్వానికి కూడా భారంగా మారుతుందని, టిడిఆర్ సర్టిఫికెట్ల ద్వారా రోడ్డు విస్తరణలో భూములు కోల్పోయిన భూ యజమానులకు అందజేస్తే తమకు ఆర్థికంగా ఎంతో మేలు చేకూరుతుందని అనేకమంది అభిప్రాయపడుతున్నారు. భూసేకరణ చట్టం ద్వారా పరిహారం పేరుతో కాలయాపన జరుగుతుందని, అనేక చోట్ల బలవంతంగా భూసేకరణ చేపట్టి,

మిగిలింది 6లో..







## నకిలీ పత్రాలతో..
# భూకబ్జాయత్నం..!

- రద్దయిన డి ఫామ్ భూముల కాజేసేందుకు ఎత్తుగడ
- రెవిన్యూ అధికారులు, రాజకీయ నేతల అండతో కాజేసే కుట్ర..!
- ముడుపుల మత్తులో ప్రేక్షక పాత్ర వహిస్తున్న అధికార గణం
- అక్రమాలకు సహకరించేయత్నం

(సూర్య ప్రతినిధి- విశాఖపట్నం)

అత్యంత ఖరీదైన ప్రాంతం... అడుగు స్థలం కనిపిస్తే పాగా వేసే ప్రాంతం.. అంతటి విలువైన మధురవాడ ప్రాంతంలో ప్రభుత్వ భూములు కబ్జా కొనసాగుతోంది. రాజకీయ నేతల అండదండలతో రెవెన్యూ అధికారులను గుప్పెట్లో పెట్టుకుని భూమాఫియా యదేచ్ఛగా భూ అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మారికవలస ఓజోన్ వ్యాలీ సమీప స్థలంలో జేసీబీతో సదులు చేసి తప్పుడు పత్రాలతో కోట్లాది రూపాయల భూములను కాజేసేందుకు ఓ ముఠా తీవ్రంగా ప్రయత్నిస్తుంది. రద్దయిన డీఫారం పట్టా భూముల్లో తప్పుడు పత్రాలతో న్యాయస్థానాన్ని మభ్యపెట్టి రూ.కోట్లు విలువ చేసే స్థలాలను సొంతం చేసుకునేందుకు కొంతమంది ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. బహిరంగంగా ఇదంతా జరుగుతున్న రెవెన్యూ అధికారులు తమకేమీ పట్ట నట్లు వ్యవహరించడంపై తీవ్ర అనుమానాలు వ్యక్తం

మిగిలింది 6లో..

## రూ. 15.91 లక్షల సీఎం సహాయ నిధి
# చెక్కుల పంపిణీ

**పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న గంటా**



విశాఖపట్నం, మార్చి 9: మేజర్ న్యూస్

భీమిలి నియోజకవర్గంలోని ఏడుగురు లబ్దిదారులకు రూ. 15.91 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థిక సాయాన్ని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఎం.వి.పి. కాలనీలోని తన కార్యాలయంలో ఆదివారం అందజేశారు. వివిధ ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్న జీవీఎంసీ 8 వ వార్డుకు

..మిగతా 2లో

## రాత్రి 11గంటల తరువాత కారణాలు లేకుండా సంచరిస్తే
# చట్టపరమైన చర్యలు తప్పవు

**విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్.**



విజయనగరం క్రైమ్, మార్చి 9, మేజర్ న్యూస్:

జిల్లాలో సహేతుకరమైన కారణం లేకుండా అర్ధ రాత్రుళ్ళు బహిరంగంగా తిరిగిన వారిపై కేసులు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మార్చి 9న హెచ్చరించారు. రాత్రి సమయాల్లో గస్తీ, పెట్రోలింగు నిర్వహించే నమయాల్లో పట్టుబడితే వారిపై కేసులు నమోదు చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ - శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు కొన్ని కఠిన నిర్ణయాలు తప్పవని, అందుకు అనుగుణంగా పోలీసు అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. విజయనగరం పట్టణంలో రైల్వే స్టేషను, ఆర్టీసి కాంప్లెక్స్, మూడు లాంతర్లు, కోట జంక్షన్, బాలాజీ జంక్షన్, దాసన్నపేటరైతు బజార్, రింగు రోడ్డు, కొత్తపేట, ఐస్ ఫ్యాక్టరీ, జమ్ము, విటి అగ్రహారం, బొబ్బిలి, నెల్లిమర్ల, రాజాం మున్సిపాల్టీల్లో కొన్ని ముఖ్య ప్రాంతాల్లోను పోలీసులు తనిఖీలు చేపడుతున్నారు. రాత్రి 11గంటల తరువాత వ్యాపారాలు, షాపులు, టిఫిన్ బండ్లు మూసివేసే విధంగా చర్యలు తీసుకొంటూ, నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యాపారాలు సాగించినా,సహేతుకరమైన కారణాలు లేకుండా బహిరంగ ప్రదేశాల్లో సంచరించిన వారిపై టౌన్ న్యూసెన్సు చట్టం

..మిగతా 2లో

## జిల్లాలో పీ-4 సర్వేని
# పక్కాగా చేపట్టాలి

**వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తరాదు**

**జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్**

పార్వతీపురం, మార్చి 9, మేజర్ న్యూస్ :



మార్చి 8 నుంచి జిల్లాలో ప్రారంభమైన పీ-4 సర్వేను పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్ట్నర్ షిప్ పక్కాగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. ఈ విషయమై సంబంధిత అధికారులతో కలెక్టర్ ఆదివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో 2 లక్షల 65 వేల గృహాలకు సర్వే చేయాల్సి ఉన్నందున, ప్రతి అధికారి పక్కా ప్రణాళికతో ప్రతి రోజూ సర్వే చేయాలని అన్నారు. పీ4 సర్వేపై ఇప్పటికే శిక్షణ కార్యక్రమం నిర్వహించినందున, ఎటువంటి అనుమానాలకు తావులేకుండా జాగ్రత్తగా చేయాలని అన్నారు. గ్రామాల్లోని ప్రజలు వారి వృత్తుల రీత్యా ఉదయమే బయటకు వెళ్ళి, సాయంత్రం తిరిగి వచ్చే అవకాశం ఉన్నందున, దాన్ని దృష్టిలో ఉంచుకొని ఉదయం, సాయంత్రం వేళల్లో సర్వేను చేయాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్, ప్రజల భాగస్వామ్యంతో ప్రతి ఇళ్లు పేదరికాన్ని అధిగమించి, ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేసే ఉద్దేశంతో ఈ విధానాన్ని ప్రభుత్వం అమలుచేస్తుందని అన్నారు. ఆర్థికంగా పరిపుష్టంగా

..మిగతా 2లో

# సమ్మెకు సిద్ధం కావాలి



విశాఖపట్నం, మార్చి 9, మేజర్ న్యూస్

ఉక్కులో కాంట్రాక్టు కార్మికుల అక్రమ తొలగింపులు ఆపకపోతే నిరవధిక సమ్మె తప్పదని అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు ఉక్కు యాజమాన్యాన్ని హెచ్చరించారు. కాంట్రాక్టు కార్మికులను ఎవ్వరినీ తొలగించరాదని. ఇప్పటి వరకు తొలగించిన వారిని అందరినీ విధుల్లోకి తీసుకోవాలని. ఇ యస్ ఐ లేని కార్మికులకు స్టీల్ యాజమాన్యమె వైద్య సౌకర్యం కల్పించాలని. నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని కోరుతూ. పాతగాజువాక లో. స్టీల్ ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ సిఐటియు అధ్యక్షులు జి శ్రీనివాసరావు అధ్యక్షతన. మహాధర్నా జరిగింది. కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ. ఉక్కు ఉత్పత్తిలో గత 30 సంవత్సరాలు గా పనిచేస్తున్న కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్యాకేజ్ ఇచ్చింది కార్మికులను తొలగించడానికా అని ప్రశ్నించారు. కార్మికుల తొలగింపు ఆపక పోతే నిరవధిక సమ్మె తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు. నమ్మి రమణ. మంత్రి రవి. కె వంశీ. ఉరుకూటి అప్పారావు. ఉమ్మడి అప్పారావు. పి గురునాద్. డి ఆనంద్. పోరాటకమిటీ నాయకులు. జె అయోధ్య రాం. డి ఆదినారాయణ. మంత్రి రాజశేఖర్. జి గణపతిరెడ్డి, పాల్గొన్నారు.

# పట్టణాల్లో రోడ్ల విస్తరణలో..
# టీడీఆర్‌ల జారీతోనే నిర్వాసితులకు మేలు!

(మొదటిపేజీ నుంచి)

భూ యజమానుల అనుమతులు కూడా లేకపోయినా, వారి అభిప్రాయాలను పక్కనపెట్టి బలవంతపు భూసేకరణ చేపడతారని అనేకమంది భూ యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోటమీ ప్రభుత్వం పట్టణాలు అభివృద్ధి చేయాలని పదేపదే చెబుతున్నప్పటికీ పెరుగుతున్న జనాభా కు అనుగుణంగా, ట్రాఫిక్ నియంత్రణకు రోడ్ల విస్తరణ చాలా ప్రాధాన్యత సంతరించుకుంది. ముఖ్యంగా విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, కాకినాడ, గుంటూరు, రాజమండ్రి, వంటి నగరాల్లో రోడ్ల విస్తరణ చాలా అవసరంగానే మారింది. ఏపీ బిల్డింగ్ రూల్స్ – 2017" ప్రకారం జీ వో నెంబర్ 119 రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ తేదీ 28.03.2017 న దానికి సంబంధించిన సవరణల ప్రకారం, ప్రామాణిక మాస్టర్ ప్లాన్ రహదారి లేదా రహదారి అభివృద్ధి ప్రణాళిక (ఆర్ డి పీ )ప్రకారం వెడల్పు చేయవలసిన ఏదైనా భూమి, స్థలం లేదా ప్రాంగణాన్ని భూస్వామి ఉచితంగా ఆమోదించు అధికారికి అప్పగించాలి. ఈ నిబంధన పాటించనిదే అభివృద్ధి అనుమతి మంజూరు చేయబడదు. భూమి యజమానులకు న్యాయమైన పరిహారాన్ని అందించడానికి బదులుగా బదిలీ అభివృద్ధి హక్కులు (టీ డీ ఆర్ ) జారీ చేయడమే ఉద్దేశం తో టి డి ఆర్ వ్యవస్థ అనేక ప్రయోజనాలను అందిస్తుంది, భూస్వాములు టి డిఆర్ బాండ్ల రూపంలో పరిహారం పొందే విధంగా, వీటిని ఆర్థిక పరంగా మార్పిడి చేసుకోవచ్చు, వెనకటికి తగ్గింపులు పొందవచ్చు లేదా అనుమతించబడిన నిబంధనల ప్రకారం అదనపు అంతస్తులను నిర్మించుకోవచ్చు. ఈ విధానం స్థానిక సంస్థ ఖజానాపై భూసేకరణ భారాన్ని తగ్గించేలా పనిచేస్తుంది, లేదంటే ఖరీదైన భూసేకరణ , పునరావాస పునరస్థాపన చట్టం 2006 వంటి మార్గాలను ఆశ్రయించాల్సి వస్తుంది. అటు ప్రభుత్వానికి ఇటు భూ యజమానులకు టిడిఆర్ జారీ తో ఎంతో మేలు జరుగుతుందని అనేకమంది ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. టిడిఆర్ లు నగర ప్రాంతాల్లో భూసేకరణ సాధనాలలో ఒకటి, ఇక్కడ అభివృద్ధికర్తలు మాస్టర్ ప్లాన్ అమలుకు స్వచ్ఛందంగా భూమిని అప్పగించి నగర అభివృద్ధిలో భాగస్వాములు అవుతారు. భూ సేకరణ చట్టం, 2006 లో పేర్కొన్నట్లు తప్పనిసరి భూసేకరణ విధానం కాకుండా, టిడిఆర్ భూస్వాములను స్వచ్ఛందంగా వారి భూమిని అందించేందుకు ప్రోత్సహిస్తూ నగర అభివృద్ధి ప్రక్రియలో చురుకుగా పాలుపంచుకునేలా ఉత్సాహపరుస్తుంది. ఈ విధానం ముఖ్యంగా ఆర్థిక వనరులు తక్కువగా ఉన్న పట్టణ స్థానిక సంస్థల కొరకు అనుకూలంగా ఉంటుంది. టి డి ఆర్ అభివృద్ధికర్తలకు విలువైన ప్రయోజనాలను అందించడంతో పాటు నగర అభివృద్ధి , మౌలిక సదుపాయాల అవసరాలు సమర్థవంతంగా తీర్చబడేలా చేస్తుందనీ అనేకమంది రోడ్ల విస్తరణలో భూములు కోల్పోయిన నిర్వాసితులు టిడిఆర్ సర్టిఫికెట్లు తమకు 4 రెట్ల ఆదాయాన్ని తెచ్చిపెట్టాయని ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. నగర ప్రాంతాల్లో భూ సేకరణ చట్టం, 2006 ప్రకారం ఖర్చు లెక్కింపు పలు ముఖ్యాంశాలను కలిగి ఉంటుంది, వీటిలో ప్రభావిత భూస్వాములకు న్యాయమైన పరిహారం అందించడమే లక్ష్యం. ఇందులో ఈ అంశాలు ఉంటాయి. ప్రాథమిక భూమి విలువ, నూతన రిజిస్ట్రేషన్ డేటా ప్రకారం అత్యధిక విలువ, సమీప ప్రాంతాల్లో ఉన్న సారూప్య భూముల సగటు అమ్మక ధర లేదా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన కనిష్ట మార్గదర్శక విలువ ఆధారంగా నిర్ణయించబడుతుంది. గుణిత కారకం, నగర ప్రాంతాల్లో మార్కెట్ విలువ సాధారణంగా 1.0 గుణించబడుతుంది. సోలేటియం, భూస్వాముల సామాజిక మరియు భావోద్వేగ ప్రభావానికి పరిహారంగా లెక్కించబడిన భూ విలువకు అదనంగా 100 శాతం చెల్లించబడుతుంది. భూమిపై ఉన్న ఆస్తుల విలువ, నిర్మాణాలు, చెట్లు, పంటలు లేదా స్థిర ఆస్తులకు పరిహారం అందించబడుతుంది. పునరావాస %డ% పునరస్థాపన ప్రయోజనాలు, ఇందులో పునరావాస ఖర్చులు, జీవనోపాధి నష్టం , నిర్వాసిత కుటుంబాలకు గృహ నిబంధనలు కలిగి ఉంటాయి. ఆలస్యం అయిన చెల్లింపులపై వడ్డీ, నోటిఫికేషన్ తేదీ నుండి చెల్లింపు ఆలస్యం అయితే వడ్డీ చెల్లించబడుతుంది. ఈ సమగ్ర విధానం ప్రజా అభివృద్ధి అవసరాలను భూస్వాముల హక్కులతో సమతుల్యం చేయడంలో సహాయపడుతుంది. విశాఖపట్నం రహదారి నెట్‌వర్క్ లో భాగంగా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా మాస్టర్ ప్లాన్ ప్రకారం అనేక మాస్టర్ ప్లాన్ రహదారులు ప్రతిపాదించబడ్డాయి, నిర్వాసితులకు కేవలం టిడిఆర్ సర్టిఫికెట్లు అందజేసి రోడ్ల విస్తరణ విజయవంతంగా నిర్వహించారు. అయితే టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ స్థాయి అధికారి లో టిడిఆర్ సర్టిఫికెట్ల మార్గదర్శకాలు సక్రమంగా అమలు చేయకపోవడంతోనే కొన్నిచోట్ల అవకతవకలు జరిగినట్లు తెలుస్తోంది. క్రింది స్థాయి ఉద్యోగులను బలి పశువులు చేసేలా ఉన్నతాధికారులు చర్యలు ఉన్నాయని అనేకమంది ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు. విశాఖలో అనేక రోడ్ల విస్తరణ కు కూటమి ప్రభుత్వం ఆటంకం లేకుండా పూర్తి చేయాలని విశాఖ వాసులు కోరుతున్నారు. జీవో నెంబర్ 136, పట్టణ పురపాలక శాఖ తేదీ 8 నవంబర్ 2021 ద్వారా ఆమోదించబడిన మాస్టర్ ప్లాన్ అభివృద్ధి దృష్టికోణ పత్రంగా, విశాఖపట్నం మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ రీజియన్‌కు 2041 సంవత్సరానికి అభివృద్ధి దృక్పథంగా రూపకల్పన చేయబడిరది. ఈ దృష్టికోణం ప్రకారం అనేక రహదారులు మాస్టర్ ప్లాన్ లక్ష్యాలకు అనుగుణంగా అమలు చేయబడ్డాయి. వీటిలో కొన్ని ఉదాహరణలు. పాత టౌన్ రహదారి (జగదాంబ జంక్షన్ నుండి పాత పోస్టాఫీసు వరకు), మెంటల్ హాస్పిటల్ రహదారి (పోలమాంబ ఆలయం నుండి బీచ్ రహదారి వరకు), కైలాసగిరి రహదారి (జోడుగుల్లపాలెం నుండి హనుమంతవాకా జంక్షన్ వరకు), సింహాచలం రహదారి (పాత ఆదివివరం నుండి గోశాల రహదారి వరకు), గ్రీన్ పార్క్ రహదారి (సెవెన్ హిల్స్ ఆసుపత్రి నుండి నౌరోజి రహదారి వరకు), పెరుగు బజారు రహదారి, వై-జంక్షన్ రహదారి (అనకాపల్లి జిల్లా), కనితి రహదారి (గాజువాక), నవోదయ , బక్కనపాలెం రహదారులు (మధురవాడ ప్రాంతంలో) వంటి రహదారులు అమలు చేయబడ్డాయి. అదనంగా, పెందుర్తి ట్రాన్సిట్ కారిడార్ (పి టి సి ) సింహాచలం ట్రాన్సిట్ కారిడార్ (ఎస్ టి సి) సహా మొత్తం బి ఆర్ టి ఎస్ కారిడార్ విజయవంతంగా అమలు చేశారు. ఈ రహదారుల అభివృద్ధి జీవీఎంసీ ద్వారా టిడిఆర్ విధానాలను అవలంబించడం ద్వారా సాధించబడ్డాయి, స్థానిక సంస్థ ఖజానాపై భారాన్ని తగ్గించేందుకు భూసేకరణ పునరావాస పునరస్థాపన చట్టం 2006 వంటి విధానాలను ఆశ్రయించకుండా మాస్టర్ ప్లాన్ అమలుకు సహాయపడిరది. ఈ వ్యూహాత్మక నిర్ణయం స్థిరమైన పట్టణ అభివృద్ధిని ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషించిందని విశాఖలో రోడ్ల విస్తరణలో అనేకమంది భూ యజమానులు తీవ్ర ఆనందం వ్యక్తం చేశారు.

## నకిలీ పత్రాలతో 'భూ కబ్జాయత్నం..!

అవుతున్నాయి. రెవెన్యూ అధికారుల అండదండలతోనే భూ కబ్జాలు జరుగుతున్నాయని పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొంతమంది అధికారులు ఆక్రమణలకు సహాయం అందిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మారికవలస ఓజోన్ వ్యాలీ సమీపంలో జేఎన్ ఎన్ యూఆర్ఎం సేవానగర్ ను ఆనుకుని ఉన్న సర్వే సంఖ్య 156/6లో 4 ఎకరాల 76 సెంట్లు డీ ఫారం స్థలాన్ని గతంలో రద్దు చేసింది. అందులో 2.26 ఎకరాల స్థలాన్ని ఏపీ టిడ్కో గృహాల నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించింది. కానీ గృహాల నిర్మాణం చేపట్టలేదు. ఆ రద్దు చేసిన డీ ఫారం స్థలాన్ని కాజేసేందుకు కొంతమంది వ్యక్తులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాయస్థానంలో ఉంటూనే ఆ స్థలాన్ని స్థిరాస్తి వ్యాపారం కోసం చదును పనులు నిర్వహించారు. అంతేగాక కొంత స్థలాన్ని అద్దె రూపంలో రూ.లక్షలు వసూలు చేసి అనధికారికంగా గొర్రెలు, మేకల సంత నిర్వహించుకు నేందుకు అడ్డగోలుగా వ్యాపారులకు ఆ స్థలాన్ని ఇచ్చేశారు. స్థానికులు అక్కడ సంత నిర్వహించవద్దంటూ ఆందోన, నిరసనలు సైతం నిర్వహించారు. అయినా యథా విధిగా సంత జరగడంతో పాటు ఆ స్థలంలో జేసీబీతో చదును పనులు చేశారు. పెద్దతొట్టె ఏర్పాటు చేసి మంచి నీరు సైతం సమకూర్చారు. స్థానిక రెవెన్యూ సిబ్బంది ఆ స్థలంలోని చెట్టుకు తహసీల్దార్ సంత కంతో కూడిన నోటీసు అంటించారు. కోర్టు వివా దంలో ఉన్నందున ఇక్కడ ఎటువంటి పనులు, సంత నిర్వహించరాదని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవంటూ నోటీసు పెట్టి వెనుదిరిగారు. అయినా సంత ఎప్పటిలానే సాగింది. వెంకట్ నగర్ సమీపంలో కొమ్మాది సర్వేసంఖ్య 157/1లో 3.85 ఎకరాల డి ఫారం పట్టా భూమి గతంలో రద్దు చేసి వీఎంఆర్డీఏకు అప్పగిం చారు. కొంత స్థలాన్ని జేఎన్ఎన్‌వ్ని ఆర్ఎం గృహాలకు కేటాయించారు. కానీ నిర్మాణాలు చేపట్టలేదు. కోట్లకు పైగా విలువ చేసే ఆ స్థలంలో కొంత కాజేసేందుకు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అది న్యాయస్థానంలో ఉంటూనే చదును చేసి కోళ్ల ఫారం ఏర్పాటు చేస్తు న్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక సచివాలయ సిబ్బంది ఆ నిర్మాణాలను అడ్డుకున్నారు. తగిన ధ్రువపత్రాలతో తహసీల్దార్ కార్యాల యాన్ని సంప్రదించాలని, అధికారుల అనుమతితో నిర్మాణాలు జరపాలని సూచించారు. కొంతమంది రాజకీయ నాయకుల అండదండలతో కోళ్ల ఫారం నిర్మాణాలు చకాచకా సాగిస్తు న్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి రద్దు చేసిన డి ఫారం భూముల స్థితిగతులను పరిశీలించి రూ.కోట్లు విలువ చేసే భూములను సంరక్షించి వాటిని ప్రజా అవసరా లకు ఉపయోగించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ భవనాలు, అంగన్వాడీ కేంద్రాలు నిర్మించాలని లేదా పేదలకు ఇల్లు నిర్మించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# కార్మికులు భద్రంగా ఉంటేనే
# రాష్ట్రం భద్రం



(మొదటిపేజీ నుంచి)

కలిసి ప్రారంభించారు. అనంతరం స్థానిక పెంటకోట కన్వెన్షన్ హాలులో నిర్వహించిన 54 వ జాతీయ భద్రతా వారోత్సవాలు కార్యక్రమానికి అయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం కార్యక్రమన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జాతీయ భద్రత వారోత్సవాలను పురస్కరించుకొని కార్మికులతో పాటు సామాన్య ప్రజానీకంలో కూడా భద్రత పట్ల అవగాహన కల్పించాలన్నారు. అనకాపల్లి జిల్లాలో 884 పరిశ్రమలు ఉన్నాయని, వాటిలో 205 ప్రమాదకరమైన కార్యకలాపాలు నిర్వహించే పరిశ్రమలు ఉన్నాయని, ఈ పరిశ్రమలన్నింటిలో దాదాపు 1,28,000 మంది కార్మికులు పనిచేయుచున్నారని తెలిపారు. ఈ సంఖ్యకు దాదాపు నాలుగు నుంచి ఐదు రెట్లు పరోక్షంగా ఉపాధి పొందే వారు ఉన్నారని, దీనివలన అనకాపల్లి పారిశ్రామిక కేంద్రంగా ఉండడంతో పాటు ప్రమాదాలకు కూడా కేంద్రంగా మారిందని, అందుకే 54వ భద్రత వారోత్సవాలను అనకాపల్లి జిల్లా నుంచి ప్రారంభించడం జరిగిందని మంత్రి తెలిపారు. ఈ వారోత్సవాలలో కార్మికులే కాకుండా సామాన్య ప్రజానీకం కూడా భాగస్వాములు కావాలని ఆయన తెలిపారు. విద్యార్థులందరికీ కూడా భద్రత పట్ల అవగాహన కల్పించే ఉద్దేశంతో పాఠశాలల్లో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించడం జరిగిందని మంత్రి తెలిపారు 54వ జాతీయ భద్రత వారోత్సవా లు "సేఫ్టీ అండ్ వెల్ బీయింగ్ కృషియల్ ఫర్ వికసిత్ భారత్ 2047 " అనే నినాదం తో ప్రారంభించడం జరిగిందని అంటే కార్మికులు భద్రంగా ఉంటేనే రాష్ట్రం భద్రంగా ఉంటుంది. కార్మికుల భద్రతతోనే స్వర్ణాంధ్రప్రదేశ్ కల సాకారం అవుతుంది అనే స్పష్టమైన సందేశం ఇందులో ఇమిడి ఉందన్నారు. ఈ కలను నిజం చేసే బాధ్యత యాజమాన్యాల పైన కార్మికుల పైన మరియు అధికారులందరి పైన ఉందని, ముఖ్యంగా ప్రభుత్వం కొన్ని కీలక బాధ్యతలు తీసుకుంటుందని, అందులో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన చర్యలు గురించి సలహాలు ఇవ్వడానికి వసుధ మిశ్రా గారి నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఆ కమిటీ రిపోర్ట్ ఒక నెలలో వస్తుందని, నివేదిక వచ్చాక ఆ కమిటీ రిపోర్ట్ ఆధారంగా అన్ని భద్రతా చర్యలను ఖచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్మికుల భద్రతకు ప్రభుత్వమే కాదు యాజమాన్యం కూడా బాధ్యత వహించి వారికి కావాల్సిన సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్మికుల భద్రతకు ప్రతిజ్ఞ ఎంతో అవసరమని యాజమాన్యాలు ప్రతిరోజు కార్మికులతో భద్రత ప్రతిజ్ఞ చేయించాలన్నారు. పరిశ్రమలలో వారు చేపట్టే కార్యకలాపాలు, కార్యక్రమాలపై అవగాహన, శిక్షణ తరగతులు యాజమాన్యం కల్పించాలన్నారు. పరిశ్రమలలో కార్మికులు సేఫ్టీ కిట్స్ వేసుకొని పనిచేయాలన్నారు. యాజమాన్యాలు, కార్మికులు, ప్రభుత్వ యంత్రాంగము అందరూ కలిసి జీరో యాక్సిడెంట్స్ అనే నినాదంతోనే పని చేయాలని తెలిపారు. కార్మిక, శ్రామిక వర్గాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా కట్టుబడి ఉంటుందని మంత్రి తెలిపారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ తాను బాధ్యతలు తీసుకున్న తర్వాత నుంచి కర్మాగారాలపై ఎక్కువ దృష్టి పెట్టడం జరిగిందన్నారు. పరిశ్రమలలో ప్రమాదాలపై కార్మికులకు మాక్ డ్రిల్ నిర్వహించి భద్రత పై శిక్షణ ఇవ్వాలన్నారు. ఎంత ఎక్కువ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తే అంత మంచిదని, ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని ఆయన తెలిపారు యలమంచిలి శాసన సభ్యులు సుందరాపు విజయ్ కుమార్ మాట్లాడుతూ యాజమాన్యం, కార్మికులు సంయుక్త కృషితో జీరో యాక్సిడెంట్ కు కృషి చేయాలన్నారు. ప్రతి కార్మికునికి భీమా సహాయం అందాలంటే ఆయా పథకాలలో నమోదు కావలసి ఉందన్నారు. కార్మికులు వారికి దగ్గరలో గల కార్మిక శాఖ అధికారులను సంప్రదించి బీమా పథకాలపై అవగాహన కల్పించుకోవాలని, కార్మిక శాఖ అధికారులు కూడా ఎప్పటికప్పుడు కార్మికులకు భద్రత, బీమా అంశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం ఆయా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులందరికీ మంత్రి చేతులు మీదుగా ప్రశంసాపత్రాలు, మెమొంటోలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో కర్మాగార శాఖ డైరెక్టర్ చంద్ర శేఖర్ మూర్తి, కర్మాగార సంయుక్త ముఖ్య తనిఖీ అధికారి జె.శివ శంకర్ రెడ్డి, జిల్లా పరిశ్రమల కేంద్రం జి ఎం నాగ రాజరావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈ ఈ ముకుందరావు, ఎన్ డి ఆర్ ఎఫ్, ఎస్ డి ఆర్ ఎఫ్, నేవీ, ఫైర్ సర్వీసెస్,హెచ్. పి. సి. ఎల్., బృందాలు మరియు ఎన్ టి పి సి, హేటరో ఫార్మా కంపెనీ అచ్చుతాపురం, పరవాడ కర్మాగారల కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు



## రాత్రి 11గంటల తరువాత కారణాలు లేకుండా సంచరిస్తే
# చట్టపరమైన చర్యలు తప్పవు

(మొదటిపేజీ నుంచి)

ప్రకారం కేసులు నమోదు చేయడంతోపాటు, వారిని పోలీసు స్టేషనుకు తరలించి, వారి తల్లిదండ్రులను పిలిపించి, కౌన్సిలింగునిర్వహిస్తున్నామన్నారు. నేరాల నియంత్రణలో భాగంగా ఇప్పటి వరకు రాత్రి గస్తీల్లోను, పెట్రోలింగు నిర్వహించడంలో మౌళికమైన మార్పులను చేపట్టారు. రాత్రి పెట్రోలింగు, గస్తీ విధులకు వెళ్ళే పోలీసు సిబ్బందికి సంబంధిత పోలీసు అధికారులు సమావేశమై, రాత్రి గస్తీలో నిర్వహించాల్సిన విధుల పట్ల వారికి దిశా నిర్ధేశం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆయా బీటు పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, పాయింటు పుస్తకాలుగల ప్రాంతాలను తప్పనిసరిగా సందర్శించే విధంగా చర్యలు చేపట్టారు. అంతేకాకుండా, ఆయా బీటు పరిధిలో నివసించే హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తుల కదలికలను గమనించాలని, ఆయా వివరాలను బీటు పుస్తకంలో నమోదు చేయాలని, అనుమానస్పద వ్యక్తులను ప్రశ్నించి, వారి వేలి ముద్రలను ఎం.ఎస్.సి.డి. పరికరంతో చెక్ చేయాలని, వారి నేర చరిత తెలిసిన తరువాతనే వారిని విడిచిపెట్టాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. రాత్రి గస్తీ, పెట్రోలింగు నిర్వహించే పోలీసు సిబ్బంది తమ వెంట తప్పనిసరిగా టార్గెట్స్, విజిల్స్, లాఠీలను తప్పనిసరిగా తమవెంట తీసుకొని వెళ్ళాలన్నారు. నేరాల నియంత్రణలో భాగంగా జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పెట్రోలింగు తిరిగే వాహనాలను, బీటు పర్యవేక్షణ అధికారులను నిరంతరం రాత్రుళ్ళు అప్రమత్తం చేయాలని పోలీసు కంట్రోల్ రూం సిబ్బందిని జిల్లా ఎస్పీ ఆదేశించారు. అంతేకాకుండా, అవసరమైన సమయాల్లో ఆకస్మికంగా వాహన తనిఖీలు చేపట్టే విధంగా చర్యలు చేపట్టారు. ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు కారణాలు లేకుండా రాత్రి 11గంటల తరువాత సంచరించే వారిపై జిల్లా వ్యాప్తంగా 845 కేసులు నమోదు చేసామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

## రూ. 15.91 లక్షల
# సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

(మొదటిపేజీ నుంచి)

చెందిన గెడ్డం ప్రణీత్ కు రూ. 5.36 లక్షలు, జక్కంపూడి రేణుక కుమారునికి రూ. 5 లక్షలు, తగరపువలసకు చెందిన మాదాబత్తుల ఉమా కృష్ణవేణికు రూ. 2 లక్షలు, మీసాల ప్రసాద్ కు రూ. 40 వేలు, ఆనందపురం మండలం ఆనందపురం గ్రామానికి చెందిన శెట్టి ఎర్రి నాయుడుకు రూ. 1.65 లక్షలు, చందక గ్రామానికి చెందిన లొడగల జాస్మిన్ విజయ్ యాదవ్ కు రూ. లక్ష, జీవీఎంసీ 5 వార్డుకు చెందిన శరగడం నిహారికకు రూ. 44 వేల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ప్రజల ఆశలు ఆకాంక్షలకు తగ్గట్టు పని చేస్తూ వారి మన్ననలు పొందుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కొప్పల రమేష్,, చెట్టుపల్లి గోపి, చిన్న గోపి, మంగాదేవి, మొల్లి లక్ష్మణరావు, నాగోతి సత్యనారాయణ, తమ్మిన సూరిబాబు, పిట్టా సురేష్, పాండ్రంగి అప్పలరాజు, అంగటి రాము, ఎస్.రామారావు, మీసాల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# అధ్యాపకుల సమస్యలు పరిష్కరించండి
## మంత్రి నాదెండ్ల మనోహర్ కు వినతి పత్రం

లక్కవరపుకోట మసర్చి )



కిత్తన్నపేట గ్రామానికి చెందిన యువ సాహితీవేత్త, అధ్యాపకుడు, రాచకొండ నరసింహ శర్మ సాహితీ సంస్థ ఉపాధ్యక్షుడు డాక్టర్ కిలారి గౌరీ నాయుడు కాకినాడలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ తో ఆదివారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యను బోధిస్తూ విద్యారంగ అభివృద్ధికి విశేష సేవలను అందిస్తున్న అతిథి అధ్యాపకుల సమస్యలపై గౌరీ నాయుడు వినతిపత్రం అందించారు .ఒక కళాశాలలో పర్మినెంట్ అధ్యాపకుల బదిలీలు జరిగినప్పుడు అతిథి అధ్యాపకులను పోస్టు ఖాళీగా ఉన్న డిగ్రీ కళాశాలకు పంపించేలాగ విద్యాశాఖ జీవో జారీ చేసేలాగ కూటమి ప్రభుత్వం కృషి చేయాలని పేర్కొన్నారు. అలాగే నెలవారి ఇచ్చే జీతం గంటల చొప్పున కాకుండా సంవత్సరంలో 12 నెలలు కన్సాలిడేటెడ్ జీతం ప్రభుత్వం ఇచ్చేలాగ ప్రభుత్వం తరపున సహకారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. గత సంవత్సరం ఏప్రిల్ 4వ తేదీన గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ను ఆంధ్రప్రదేశ్ డిగ్రీ కళాశాల అతిథి అధ్యాపకుల సంఘం నాయకులు కలిసినప్పుడు ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారని గౌరీ నాయుడు గుర్తు చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి వంతు సహకారాన్ని అందిస్తానని తెలియజేశారు. జనసేన అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి పార్టీ తరపున సహకారాన్ని అందిస్తానని మంత్రి మనోహర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గజపతినగరం మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రివర్యులు పడాల అరుణ, జనసేన పార్టీ రాష్ట్ర జన సైనికురాలు పాలవలస యశస్వి, ఆంధ్రప్రదేశ్ అతిథి అధ్యాపకుల సంఘం రాష్ట్ర నాయకులు అప్పలరాజు, సత్యనారాయణ, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, ప్రవీణ్ కుమార్, వివిధ జిల్లాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# దాతృత్వం చాటుకున్న డా.రెడ్డీస్ కార్మికులు
## ఆర్థిక సహాయం అందజేత

రణస్థలం, మార్చి 10, మేజర్ న్యూస్:



పైడిభీమవరం డా.రెడ్డీస్ లేబొరేటరీస్ పరిశ్రమలో పనిచేస్తున్న దేవుని పాలవలస గ్రామానికి చెందిన కార్మికుడు బుక్కు.రామారావుకు ఇటీవలె బ్రెయిన్ ట్యూమర్ వచ్చింది. స్పందించిన తోటి కార్మికులంతా డా.రెడ్డీస్ లేబొరేటరీస్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో యూనియన్ సభ్యులు నుండి వసూలు చేసిన 64 వేల రూపాయలను సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.అమ్మన్నాయుడు, డా.రెడ్డీస్ లేబొరేటరీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు చేతులు మీదుగా పాలవలస గ్రామంలో కార్మికుడి ఇంటివద్ద అందజేశారు. ఈ సందర్భంగా అమ్మన్నాయుడు మాట్లాడుతూ విరాళం అందజేసిన కార్మికులకు అభినందనలు తెలిపారు. యూనియన్ విజ్ఞప్తి మేరకు యాజమాన్యం ఒక లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందజేసిందని అన్నారు. వైద్యానికి లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని, కుటుంబానికి ఉపాధి లేకుండా పోయిందని కావున డా.రెడ్డీస్ యాజమాన్యం మెరుగైన చికిత్స అందించాలని, తగిన పరిహారం చెల్లించి కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేసారు. విరాళం ఇచ్చిన వారిలో డా.రెడ్డీస్ లేబొరేటరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.లక్ష్మునాయుడు, ఎమ్.ఈశ్వరరావు, నాయకులు పి.రామకృష్ణ, కె.శంకరరావు, ఎన్.సు.హెచ్.నాయుడు, ఎమ్.రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

# దళితులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి



రణస్థలం, మార్చి 10, మేజర్ న్యూస్:

ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ ఎచ్చెర్ల నియోజకవర్గ కార్యవర్గ సమావేశం రణస్థలం మండల కేంద్రంలో జరిగింది. ఈ సమావేశం సీనియర్ దళిత నాయకులు పల్ల నీలయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో దళితుల పలు భూసమస్యలు, ఉపాధి సమస్యల మీద చర్చించడం జరిగింది. దళితుల సమస్యలపై రాజకీయ ప్రభావం ఉండటం వల్ల మానసిక, ఆర్థిక సమస్యలకు గురైతున్నామని పలువురు విచారం వ్యక్తం చేశారు. దళితులకు దక్కిన చిన్న చిన్న ఉపాధి అవకాశాలను కొల్లగొట్టి వారి కన్నీరకు కారణం కావటం బాధాకరమని వాపోతున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా దళిత మహాసభ నాయకులు దత్తి గోవింద, దుంగ సూర్యనారాయణ, కుప్పిలి సీతప్పడు, సీనియర్ నాయకులు దుక్క ఆదినారాయణ, కుప్పిలి పైడిరాజు, కుప్పిలి లక్ష్మణరావు, గౌరవ అధ్యక్షులు సాకేటి పోతయ్య, రణస్థలం, లావేరు మండల అధ్యక్షా కార్యదర్శలు టొంపల సూరప్పడు, సమాదుల రమణ, లండ చిన్నబాబు, ఉప్పాడ చలపతిరావు, మండల ఉపాధ్యక్షులు యామల గోపాల్, బోనెల పరశురాం, మీడియా కన్వీనర్ ముక్కు రాము, ట్రెజరర్ నేతల పెంటయ్య, బంకపల్లి అప్పారావు, యండ తవుడు, కొయ్యాన కోటి, నేతల రాంబాబు, ఎల్లయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

# జిల్లాలో పీ-4 సర్వేని పక్కాగా చేపట్టాలి

(మొదటిపేజీ నుంచి)

ఉన్న వారి సహకారంతో అట్టడగు స్థాయిలో ఉంటూ జీవించడానికి కనీస సౌకర్యాలు లేని వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి ఈ విధానం అవలంభించనుందని అన్నారు. కావున ప్రజలు అందుబాటులో ఉండే సమయంలో ఒక్కొక్కరూ రోజుకు కనీసం 90 వరకు సర్వేలు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.జూన్ మాసాంతం వరకు పురపాలక, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇందుకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలను ఇప్పటినుంచే తీసుకోవాలని హితవు పలికారు. ప్రతీ ఎం.పీ.డి.ఓ, కమిషనర్ వారి పరిధిలోని నీటి కొళాయిలు, బోర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్యలు ఉన్న చోట తక్షణమే పరిష్కరించాలని స్పష్టం చేసారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో అవసరమైతే బోర్లు వేయడం, మరమ్మతులు చేపట్టాలని అన్నారు. పురపాలక పరిధిలో కొత్తగా ఏర్పడిన కాలనీలకు కూడా తాగునీటి సరఫరా కావాలని వివరించారు. ప్రతీ వారం తాగునీటి పరీక్షలు జరిపి రక్షిత మంచినీటిని సరఫరా చేయాలని తెలిపారు. స్వచ్ఛంధ సంస్థలు, దాతల సహకారంతో ఎక్కడికక్కడ చలివేంద్రాలను ఏర్పాటుచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులు, ఎం.పీ.డి.ఓలు, ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుండి యధావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక

### మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.పైడితల్లి వెల్లడి -అర్జీదారులు సమస్యలను పరిష్కార వేదికలో తెలియజేయాలి -ప్రజలు తెలియజేసిన సమస్యలు పరిష్కారానికి చర్యలు



గరుగుబిల్లి, మార్చి9, మేజర్‌న్యూస్

మండల స్థాయిలో జరిగే ప్రజా సమ స్యల పరిష్కార వేదిక (పిజిఆర్ ఎస్) కార్యక్రమం సోమవారం నుండి యదా విధిగా నిర్వహించ నున్నా మని మండల పరిషత్ అభివృద్ధి అధికారిని జి.పైడితల్లి వెల్లడించారు. జిల్లాలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎంఎల్సి ఎన్నికల కోడ్ ముగిసిన నేప థ్యంలో ఇకపై ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరుగు తుందని చెప్పారు. ఈవిషయంను ప్రజలు గమనించాలని కోరారు. సోమవారం మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రజా సమస్యల పరి ష్కార వేదిక నిర్వహించనున్నామన్నారు. సమస్యలపై ప్రజలు విన తులు అందజేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పైడితల్లి పేర్కొన్నారు. ప్రజలు తెలియజేసిన సమస్యలు త్వరితగతిన పరిష్క రించేందుకు చర్యలు చేపట్ట నున్నా మన్నారు.

# గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం' కార్యక్రమం

### గ్రంథాలయ నిర్వాహకులు నల్ల మధుసూధనరావు .. విద్యార్థులకు పలురకాల ఆటలు పోటీలు

గరుగుబిల్లి, మార్చి9, మేజర్‌న్యూస్



మండల కేంద్రంలోని శాఖా గ్రంథాల యంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బోనెల లక్ష్మి ఆదేశాలు మేరకు ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమంను నిర్వహించారు. ఈకార్యక్రమం లో భాగంగా పద్యంలు,గద్యంలు,మరియు చదరంగం, క్యారంబోర్డు, పోటీలను విద్యార్థులకు నిర్వహించారు. ఈసందర్భంగా శాఖా గ్రంధాలయం నిర్వాహకులు నల్ల మధుసూదనరావు మాట్లాడుతూ గ్రంధాలయాల్లో విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే పలురకాల పుస్తకాల ను సిద్ధం చేశామని వీటిని చదువు కోవాలని కోరారు. పోటీ పరీక్షలకు ఉపయోగ పడే పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయ న్నారు. గ్రంథాలయంలో జిల్లా గ్రంధాలయ సంస్థ కార్యదర్శి ఆదేశాలు మేరకు నిర్వహిస్తున్న చదవడం మాకిష్టం కార్యక్రమంను విజయ వంతంగా నిర్వహించడంతో పాటు విద్యార్థులకు చదువుపై ఆసక్తి కలిగించేలా పలు కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ప్రస్తుతం నిర్వహించిన చదవడం మాకిష్టం కార్యక్రమంలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని గ్రంథాలయ నిర్వాహకులు మధుసూద నరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

# 'యువత పోరు' పోస్టర్ ఆవిష్కరణ

### ఆవిష్కరించిన మన్యం జిల్లా వైకాపా అధ్యక్షులు పరీక్షిత్ రాజు తదితరులు -పాల్గొన్న మండల వైకాపా కన్వీనర్ కేతిరెడ్డి అచ్యుతరావు -యువత పోరు కార్యక్రమానికి అధిక సంఖ్యలో తరలి రావాలి



గరుగుబిల్లి,మార్చి 9,మేజర్‌న్యూస్

రాష్ట్రంలో లక్షలాదిమంది విద్యార్థులు, యువతను, నిలువునా మోస గించిన కూటమి ప్రభుత్వం తీరును ఎండగడుతూ ఆయా వర్గాల తరపున ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేం దుకు ఈనెల12వ తేదీన జిల్లా కేంద్రంలో తలపెట్టిన యువత పోరు పోస్టర్‌ను పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్య క్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు ఆదివారం ఆవిష్కరించారు. ఈమేరకు చిన మేరంగిలో జరిగిన "యువత పోరు"పోస్టర్ ఆవిష్కరణ కార్య క్రమంలో మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కేతిరెడ్డి అచ్యుతరావు తదితరులు పాల్గొ న్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేం దుకు ఈనెల 12న పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో యువత పోరు కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించిన అనంతరం జిల్లా కలెక్టర్ కు మెమోరాండం సమర్పించ నున్నారు. ఈమేరకు యువత పోరు ర్యాలీ కార్యక్రమంలో మండలం నుంచి అధిక సంఖ్యలో పాల్గొనాలని మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కేతిరెడ్డి అచ్యుతరావు కోరారు.

# నేటినుండి యధావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక

### మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.త్రివిక్రమారావు

సీతానగరం మార్చి9, మేజర్‌న్యూస్



మండల స్థాయిలో జరిగే ప్రజా సమ స్యల పరిష్కార వేదిక (పిజిఆర్ ఎస్) కార్యక్రమం సోమవారం నాడు యదా విధిగా నిర్వహించ నున్నా మని మండల పరిషత్ అభివృద్ధి అధికారిని పి.త్రివిక్రమారావు తెలిపారు. జిల్లాలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎం ఎల్ సి ఎన్నికల కోడ్ ముగిసిన నేప థ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నా మని ఈవిషయంను ప్రజలు గమనించాలని సోమవారం మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రజా సమస్యల పరి ష్కార వేదిక నిర్వహిస్తామని సమస్యలపై ప్రజలు విన తులు అందజేయాలని పేర్కొన్నారు. ప్రజలు తెలియజేసిన సమస్యలు త్వరితగతిన పరిష్క రించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు.

# జనసేన ఆవిర్భావ దినోత్సవంను విజయవంతం చేయాలి



### ఈనెల 14న పిఠాపురంలో వేడుకలు

మక్కువ, మార్చి 9, మేజర్‌న్యూస్

ఈనెల 14వ తారీఖున పిఠాపురంలో నిర్వహిస్తున్న జనసేన పార్టీ ఆవిర్భవ దినోత్సవం వేడుకను విజయవంతం చేయాలని సాలూరు నియోజకవర్గ సమన్వయకర్త గేదలు రిషి వర్ధన్ పార్టీ శ్రేణులకు కోరారు. ఆదివారం నాడు మక్కువ లో సాలూరు నియోజకవర్గం పరిధిలో గల నాలుగు మండలాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడచిన 11 ఏళ్లగా ఎన్నో అపజయాలు, నిందలు, అవమానాలు తట్టుకొని ఈ రోజు ఆంధ్రప్రదేశ్ లోనే గాక, యావత్ భారత దేశంలోనే వందకి వంద శాతం స్ట్రైక్రెట్ తో విజయం సాధించి చరిత్రలో నిలిచిన పార్టీ జనసేన పార్టీ అన్నారు. అధికార భాగస్వామ్యంతో మొదటిసారి ఆవిర్భవ దినోత్సవం జరుపుకుంటున్న నేపథ్యంలో సాలూరు నియోజకవర్గం నలుమూలల నుండి జన సైనికులంతా సభకు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా నాయకులతో కలిసి ఆవిర్భవ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో సాలూరు మండల అధ్యక్షులు శివ కృష్ణ, మెంటాడ మండల అధ్యక్షులు రాజశేఖర్ ,మక్కువ మండల ఉపాధ్యక్షులు వెంపటాపు సుగుణేశ్వరరావు, మణికంఠ, జగదీష్, తవిటి రాజు ,రహీం, అవినాష్, శ్రీకాంత్ తదితర నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేసిన కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, మార్చి 9, మేజర్‌న్యూస్



జియ్యమ్మవలస మండలం, కన్నపుదొరవలస గ్రామానికి చెందిన ఈగల సత్యనారాయణ అనారోగ్యానికి గురైన విషయం ఎమ్మెల్యే దృష్టికి రావడంతో స్పందించి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ.63,727ల ఆర్థిక సహాయం అందేలా కృషిచేసి, ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో చెక్కును కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అందజేశారు. ఈ మేరకు సత్యనారాయణ కుటుంబ సభ్యులకు ఆ చెక్కును ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.


# కాజా రెస్టారెంట్ ఢాబాను ప్రారంభించిన కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, మార్చి 9, మేజర్‌న్యూస్



గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రానికి చేరువలో ఉన్న పి.లేవిడి గ్రామం వద్ద కాజా రెస్టారెంట్ ధాబా ను ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే డాబా పరిసరాలను, వంటగదిని, ఇతర ఏర్పాట్లును చూసి చాలా ఆనందాన్ని వ్యక్తం చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన వంటకాలను తిని వాటి యొక్క రుచిని ఆస్వాదించారు. వారి యొక్క వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ధాబా నిర్వాహకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు నిధులు మంజూరు



ఆమదాలవలస, మార్చి 9, మేజర్‌న్యూస్

పొందూరు మండలంలో ఆరు తారు రోడ్లు నిర్మాణాలకు ప్రభుత్వ నిధులు మంజూరు చేసినట్లు ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవి కుమార్ కార్యాలయం నుంచి ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 1060 లక్షల రూపాయలు మంజూరు జరిగి నట్లు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు ఇవ్వడం జరిగిం దని పేర్కొన్నారు. పొందూరు మండలంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేసి, నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఆర్ అండ్ బి శాఖామంత్రి జనార్దన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. నియోజక వర్గ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేయడం జరుగుతుందన్నారు.

# సిర్ల పోతన్న యల్లమాంబ యాత్రకు నేతలు తాకిడి : ఎమ్మెల్యే మామిడి

### జిల్లా బీజేపీ అధ్యక్షులు సిరిపురంలు నివగాం తరలిన నేతలు



కొత్తూరు, మార్చి 9, మేజర్‌న్యూస్

కొత్తూరు మండలం నివగాంలో వెలసిన సిర్ల పోతన్న యల్ల మాంబ యాత్రకు రాజకీయ ప్రజా ప్రతినిధులు తాకిడైంది. పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సిర్ల పోతన్న ను ఆదివారం దర్శించు కోని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అదే విధంగా భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు ఆయన అనుచరులతో సిర్ల పోతన్న ను దర్శించు కొని ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట మాతల గాంధీ, నూలు వీర భద్ర స్వామి, టంకాల రమణారావు, రేగేటి కన్నయ్య స్వామి, యంపిటిసి ప్రతినిధి బిల్లింగి సంజీవరావు, మండల బీజేపీ అధ్యక్షులు బూరద భాస్కరరావు, పాతపట్నం బీజేపీ అధ్యక్షులు పడాల షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

# ధైర్యం, ఆత్మవిశ్వాసంతో ఎయిడ్స్‌ని జయించవచ్చు

### ఎయిడ్స్ నియంత్రణ లింగ్క్ వర్కర్స్‌ని సత్కరించిన కారుణ్య సంస్థ



బొబ్బిలి, మార్చి 9: మేజర్‌న్యూస్

ఎయిడ్స్ బారిన పడిన వారు ధైర్యం, ఆత్మవిశ్వాసం కోల్పోకుండా సక్రమంగా మందులు వాడుతూ పౌష్టికాహారాన్ని తీసుకుంటూ ఉంటే ఎయిడ్స్‌ని జయించవచ్చు అని కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జెసి అన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీవో హోం నందు చైల్డ్ ఫర్డ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ విజయనగరం వారి ఆధ్వర్యంలో కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జెసిరాజు ఆర్థిక సహకారంతో హెచ్ఐవి బాధితులకు పౌష్టికాహారాన్ని అందించే కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఎస్.అప్పలనాయుడు డిఆర్పి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా కారుణ్య సంస్థ చైర్మన్ పాల్గొని మాట్లాడారు. అవగాహనతో క్రమబద్ధమైన జీవనశైలి మంచి ఆహారం మందులు తీసుకుంటూ ఉంటే ఎయిడ్స్ గురించి భయపడవలసిన అవసరం లేదన్నారు. ఎయిడ్స్ బాధితులకు పౌష్టికాహారం ఎయిడ్స్ బాధిత పిల్లలకు విద్యకు అవసరమైన సహకారం కారుణ్య సంస్థ అందిస్తుందన్నారు. 20 వేల రూపాయలతో 40 మంది ఎయిడ్స్ బాధితులకు పౌష్టికాహారాన్ని జెసి రాజు అందించారు. అనంతరం ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ఎప్పటికప్పుడు సూచనలు సలహాలు ఇస్తు వారి యెడల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న మహిళా లింక్ వర్కర్స్ కు కారుణ్య సంస్థ ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బి ప్రసాద్, లింక్ వర్కర్స్, హరి, గోవిందా, జి.విజయ, పి.సత్యవతి, సిహెచ్.నిర్మల, విజయ పాల్గొన్నారు.

# టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలి

### సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు



బొబ్బిలి, మార్చి 9, మేజర్‌న్యూస్

పట్టణ పేదల కోసం రామన్నదొరవలస సమీపంలో నిర్మించిన టిడ్కో ఇళ్ల సము దాయాన్ని ఆదివారం సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఇల్లు లేని పేదల కోసం గతంలో టీడీపీ హయాంలో టిడ్కో ఇళ్లను మంజూరు చేసిందని, అప్పటిలో నిర్మాణాలు పూర్తి చేయలేదన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. లబ్ధిదారులతో డబ్బులు కట్టించుకుని బ్యాంకు రుణాలు తీసుకుని ఇళ్ల నిర్మాణం పూర్తి చేయకపోవడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారన్నారు. ఇల్లు అప్పగించకుండానే బ్యాంకర్లు లబ్ధిదారులకు లోన్ చెల్లిం చాలని నోటీసులు జారీ చేస్తున్నారన్నారు. 1680 ఇళ్లను నిర్మిస్తామని చెప్పిన పాలకులు నిర్మాణాలు పూర్తి చేయకపోవడం అన్యాయమన్నారు. టిడ్కో ఇళ్ల సముదాయంలో మౌలిక సదుపాయాలు పూర్తిగా లేవన్నారు. తక్షణమే ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని, మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిచో లబ్ధిదారులతో ఆందోళన చేస్తామన్నారు. సిపిఎం మండల కన్వీనర్ ఎస్.గోపాలం, నాయకులు జి.శంకరరావు ఉన్నారు.



# అరకు పార్లమెంట్ స్థానాన్ని రెండు పార్లమెంట్ స్థానాలుగా చేసి గిరిజనులకు రిజర్వు చేయాలి

గుమ్మలక్ష్మీపురం, మార్చి 9, మేజర్‌న్యూస్

ప్రస్తుతం ఏడు అసెంబ్లీ స్థానాలతో భౌగోళికంగా పాలనకు ఇబ్బందిగా ఉన్న అరకు పార్లమెంట్ స్థానాన్ని డీ లిమిటేషన్‌లో రెండుగా ఒకటి మన్యం జిల్లా పార్వతీపురం పార్లమెంట్ గాను, మరొకటి అల్లూరి జిల్లా అరకు పార్లమెంట్ గాను రెండుగా విభజన చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన గుమ్మలక్ష్మీపురంలో విలేకరులతో మాట్లాడుతూ ఆరుకు పార్లమెంటు స్థానాన్ని రెండు స్థానాలు గిరిజనులకు రిజర్వ్ చేయాలని అన్నారు. అలాగే గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర శాఖ కార్యాలయం విశాఖపట్నంలో ఏర్పాటు చేయాలని అన్నారు. అధికంగా గిరిజనులు ఉన్న ప్రాంతంకావడంతో గిరిజనులకు పాలన చేరువ అవుతుందని ఆయన తెలిపారు.

# జిల్లాలో పీ-4 సర్వేని పక్కాగా చేపట్టాలి

### వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తరాదు : జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం, మార్చి 9, మేజర్‌న్యూస్

మార్చి 8 నుంచి జిల్లాలో ప్రారంభమైన పీ-4 సర్వేను పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్ట్నర్ షిప్ పక్కాగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. ఈ విషయమై సంబంధిత అధికారులతో కలెక్టర్ ఆదివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహిం చారు. జిల్లాలో 2 లక్షల 65 వేల గృహాలకు సర్వే చేయాల్సి ఉన్నందున, ప్రతి అధికారి పక్కా ప్రణాళికతో ప్రతి రోజూ సర్వే చేయాలని అన్నారు. పీ4 సర్వేపై ఇప్పటికే శిక్షణ కార్యక్రమం నిర్వహించినందున, ఎటువంటి అనుమానాలకు తావులేకుండా జాగ్రత్తగా చేయాలని అన్నారు. గ్రామాల్లోని ప్రజలు వారి వృత్తుల రీత్యా ఉదయమే బయటకు వెళ్ళి, సాయంత్రం తిరిగి వచ్చే అవకాశం ఉన్నందున, దాన్ని దృష్టిలో ఉంచుకొని ఉదయం, సాయంత్రం వేళల్లో సర్వేను చేయాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్, ప్రజల భాగస్వామ్యంతో ప్రతి ఇళ్లు పేదరికాన్ని అధిగమించి, ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేసే ఉద్దేశంతో ఈ విధానాన్ని ప్రభుత్వం అమలుచేస్తుందని అన్నారు. ఆర్థికంగా పరిపుష్టంగా ఉన్న వారి సహకారంతో అట్టడుగు స్థాయిలో ఉంటూ జీవించడానికి కనీస సౌకర్యాలు లేని వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి ఈ విధానం అవలంభించనుందని అన్నారు. కావున ప్రజలు అందుబాటులో ఉండే సమయంలో ఒక్కొక్కరూ రోజుకు కనీసం 90 వరకు సర్వేలు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.జూన్ మాసాం తం వరకు పురపాలక, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇందుకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలను ఇప్పటినుంచే తీసుకోవాలని హితవు పలికారు. ప్రతీ ఎం.పీ.డి.ఓ, కమిషనర్ వారి పరిధిలోని నీటి కొళాయిలు, బోర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్యలు ఉన్న చోట తక్షణమే పరిష్కరించాలని స్పష్టం చేసారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో అవసరమైతే బోర్లు వేయడం, మరమ్మతులు చేపట్టాలని అన్నారు. పురపాలక పరిధిలో కొత్తగా ఏర్పడిన కాలనీలకు కూడా తాగునీటి సరఫరా కావాలని వివరించారు. ప్రతీ వారం తాగునీటి పరీక్షలు జరిపి రక్షిత మంచినీటిని సరఫరా చేయాలని తెలిపారు. స్వచ్ఛంధ సంస్థలు, దాతల సహకారంతో ఎక్కడికక్కడ చలివేంద్రాలను ఏర్పాటుచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులు, ఎం.పీ.డి.ఓలు, ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్మాణాల్లో ఉన్న ఆర్ అండ్ బి వంతెలను పరిశీలించిన ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర



సీతానగరం, మార్చి 9, మేజర్‌న్యూస్

మండలంలో సీతానగరం సువర్ణముఖి నదిపై నూతనంగా నిర్మాణంలో ఉన్న ఆర్ అండ్ బి వంతెనను స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర ఆదివారం పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పాత వంతెన మరమ్మతులకు కోటి 50 లక్షలు నిధులు మంజూరు అయితే మాజీ ఎమ్మెల్యే స్వాహా చేశారని కేవలం నాలుగు నుంచి 16 లక్షలు ఖర్చు పెట్టి మిగతావి ఆయన జేబులో వేసుకున్నారని మా ప్రభుత్వం వచ్చి రాగానే కాంట్రాక్టు చెల్లించవలసిన బకాయిలను చెల్లించి వంతెన పనులను పున ప్రారంభించడం జరిగిందని మే జూన్ నెలలో వంతెన పనులు పూర్తిచేసే అనంతరం ప్రారంభించి వాహనాలు రాకపోకలకు కూడా సాగేలా చర్యలు తీసుకుంటున్నామని అలాగే బూర్జ చినఅంకలం వంతెన పనులకు సంబంధించి బడ్జెట్లో ప్రతిపాదించడం జరిగిందని దానికి ఆమోదం వచ్చిందని త్వరలోనే పనులు ప్రారంభిస్తామని అలాగే గెద్దలప్పి. బలిచిపేట నారాయణపురం వంతెనలకు సంబంధించి పూర్తిస్థాయిలో పనులను చేపడతామని ఈ సందర్భంగా తెలియజేశారు. పెద భోగిల ఉప సర్పంచ్ కంకణపల్లి అరవింద్. టిడిపి పార్టీ నాయకులు రౌతు వేణుగోపాల్ నాయుడు. పెంట సత్యం నాయుడు. శేఖర్. వెంకటప్ప నాయుడు. అన్నం నాయుడు, బుడితి శ్రీనుతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# లివర్ వ్యాధిగ్రస్తునకు సిఎం ఫండ్ నుండి సహాయం

కొత్తూరు, మార్చి 9, మేజర్‌న్యూస్






కొత్తూరు మండలం ఆర్ ఆర్ కాలనీకి చెందిన ఇనుమల మురళి కుమారుడు సాయి హరీష్‌కు సియం సహాయ నిధి నుండి మంజూరైన రూ.186,805చెక్కును పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆదివారం బాధితుడు తండ్రికి అందజేశారు. సాయి హరీష్ గత కొంత కాలం నుండి లివర్ వ్యాధితో బాధ పడుతున్నారు. వైద్యం చేయించు కోడానికి తగిన ఆర్థిక స్తోమత లేకపోవడం తో సియం సహాయ నిధికి దరకాస్తు చేసుకొన్నారు. వైద్య ఖర్చుల కోసం మంజూరు చేసిన 1,86,805 రూపాయల చెక్ ను ఎమ్మెల్యే గోవిందరావు మంజూరు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వైద్య సమస్యల తో ఇబ్బందులు పడుతున్న వారికి సకాలంలో చికిత్స కోసం సియం సహాయ నిధి అందిస్తున్న ఆర్థిక సహాయం సద్వినియోగం చేసుకోవాలని అయనన్నారు.వివిధ రకాల వ్యాధులకు గురై వైద్యం చేయించుకొనే ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సియం పండ్ ద్వారా ఉదారం గా ఆర్థిక సహాయం అందించి నిలుస్తుంది ఎన్డిఏ ప్రభుత్వమేనని ఆయన స్పష్టం చేశారు.పార్టీలకు అతీతంగా కేవలం అర్హత ఆధారంగా సియం సహాయ నిధి నుండి నిధులు అందిస్తున్నారని ఎమ్మెల్యే అన్నారుగత పాలకులు ఏ రోజు కూడ ఆపదలో ఉన్నవారికి సహాయం చేసిన దాఖలాలు కన్పించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మెట్టూరు బిట్ 3సర్పంచ్ కోయిలాపు శ్రీనివాసరావు, మాజీ యంపిటిసి కోయిలాపు సంజీవరావు,తొత్తడి పోలీనాయుడు,వంబరవెల్లి శ్రీనివాసరావు, బాదితుడు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ ఉద్యమరంగానికి తీరనిలోటు

### -ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన రామానుజాచార్యులు

ఆమదాలవలస, మార్చి 9, మేజర్ న్యూస్




ఉపాధ్యాయ రంగంలో అంకితభావం తో పని చేస్తూ విద్యా రంగం అభ్యు న్నతికి పాటు పడిన మహోన్నత వ్యక్తి తమ్మినేని సీతారామానుజా చార్యులు అని ఏపీటీఎఫ్ రాష్ట్ర నేత పాకలపాటి రఘువర్మ అన్నారు. ఆమదాల వలస పట్టణంలో కొత్తకోట వారి వీధిలో సీతారామాను జాచార్యుల సంతాప సభ శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రఘువర్మతో పాటు విశిష్ట అతిథులుగా పాల్గొన్న ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.సరస్వతి, జిల్లా కార్యదర్శి అనిల్‌కుమార్ మాట్లాడుతూ విద్యా రంగానికి తన ఉద్యోగ కాలంలో ఎనలేని సేవలు అందించిన రామానుజాచార్యులు ఇటు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ఏపీటీఎఫ్‌లో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఆమదాలవలసలో ఏపీటీఎఫ్ బలోపేతానికి తన వంతు నిరంతరం పాటు పడ్డారన్నారు. ఆయన ఆశయాల సాధనకు ఏపీటీఎఫ్ అంకితభావంతో పని చేస్తుందని అన్నారు. విద్య, ఉద్యోగ రంగ సమస్యల పరిష్కా రంలో తన పదవీ కాలంలో అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ఐక్యంగా ముందుకు సాగుదామన్నారు. సభలో పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు కూన సుందరరావు, బొడ్డేపల్లి మోహనరావు, బొడ్డేపల్లి జనార్దనరావు, చంద్రమౌళి, బుడుమూరు గోవిందరావు, తమ్మినేని అమరవాణి, బొడ్డేపల్లి జోగారావు, చంద్రశేఖర్, వైద్యులు టీవీవీవీఎస్ ప్రసాద్, పొన్నాడ జ్యోతిర్మయితో పాటు సువ్వారి రమణమూర్తి, కుటుంబసభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సిర్ల పోతన్నను దర్శించుకొన్న లోతుగెడ్డ

కొత్తూరు, మార్చి 9, మేజర్‌న్యూస్



మండలంలోని నివగాం లో వెలసిన సిర్ల పోతన్న యల్ల మాంబను ఆదివారం మండల దేశం నేత, వైస్ యంపిపి లోతుగెడ్డ తులసీ వర ప్రసాదరావు, ఆయన అనుచరులు కలసి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఆయన వెంట రేగేటి కన్నయ్య స్వామి, యంపిటిసి ప్రతినిధి బిల్లింగి సంజీవరావు, సొంట్యాన వినోద్,సుంకు ప్రసాద్, బూరాడ సుందర నారాయణ, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

## కరాటే పోటీలలో ఆదిత్య విద్యాలయం విద్యార్థులు పతకాలపంట



నెల్లిమర్ల, మార్చి 9, మేజర్‌న్యూస్

కరాటేలో నెల్లిమర్ల శ్రీ ఆదిత్య విద్యాలయం విద్యార్థులు ప్రతిభకనబరిచారు. విజయనగరం రాజీవ్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన ఇంటర్ డిస్ట్రిక్ కరాటే చాంపియన్ షిప్ 2025 పోటీలలో శ్రీ ఆదిత్య విద్యాలయం విద్యార్థులు పతకాలపంట పండించారు. ఈ పోటీలలో పాఠశాలకు చెందిన 16 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ఆరుగురు గోల్డ్ మెడల్ సాధించగా ఎడుగురు సిల్వర్ మెడల్స్ కైవసం చేసుకున్నారు. మరో ముగ్గురు బ్రాంజ్ మెడల్ పొందారు. అలాగే కరాటేలో చాంపియన్ షిప్ సాధించారు. పతకాల సాధించిన వారిని కోచ్ మధుని పాఠశాల కరస్పాండెంట్ వసాది సూరిబాబు, ప్రిన్సిపాల్ అమృత, ఉపాధ్యాయులు అభినందించారు.

## ఘనంగా అమ్మవారి మారు జాతర

చీపురుపల్లి, మార్చి 9, మేజర్‌న్యూస్



ఉత్తరాంధ్ర కల్పవల్లి, చీపురుపల్లి గ్రామ దేవత శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మారు జాతర ఆదివారం ఘనంగా జరిగింది. ఈనెల 2. 3, 4 తేదీలలో అమ్మవారి జాతర నిర్వహించిన తరువాత మారు జాతర నిర్వహించడం ఆన్వయి తీగా వస్తుంది. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా అమ్మవారి మారు జాతర ఉత్సవం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ ఈఓ బి శ్రీనివాసరావు, ఆలయ కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మారు జాతర ఉత్సవాలను నిర్వహించారు. చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం మండలాలకు చెందిన పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మారు జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులందరికీ ఉచిత అన్నదాన ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, పాల్గొన్నారు.

## నేటి నుంచి క్రాష్ ప్రోగ్రామ్

నెల్లిమర్ల, మార్చి 9, మేజర్‌న్యూస్

మండలంలోని గ్రామాలలో తాగునీటి ఎద్దడి నివారణకు ఈనెల 10 నుంచి ఏప్రిల్ 26వ తేది వరకూ క్రాష్ ప్రోగ్రామ్ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10న మొయిద, 11న నారాయణ పట్నం, పూతికపేట, 12న కొండగుంపాం గ్రామంలో క్రాష్ ప్రోగ్రామ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే 13న గరికిపేట, 15న తంగుడిబిల్లి, 17న ఎటి అగ్రహారం, 18,19న సారిపల్లిలో 20న కుదిపి, నీలంరాజు పేట, 21న చంద్రమ్మపేట, ఎల్ ఎన్ పురం, 22న తాళ్లపూడి పేట, టెక్కలిలో క్రాష్ ప్రోగ్రామ్ ఉంటుందన్నారు. 24న చిన బూరాడపేట, పెద బూరాడపేటలో గ్రామాలలో, 25న పారసాం, గెద్దపేట, 26న గొర్లిపేట, 27న గుషిణి, 28న బర్లపేట, చనమల్లుపేట, 29న వల్లూరులో క్రాష్ ప్రోగ్రామ్ నిర్వహిస్తారని చెప్పారు. ఎప్రిల్ 1న బొడ్డపేట, పెదతరిమి 2న మల్యాడ వెంకన్నపాలెం, 3న బొప్పడాం, 4న పినతరిమి, బుచ్చన్నపాలెం, 5న జోగిరాజుపేట గ్రామంలో క్రాష్ ప్రోగ్రామ్ నిర్వహిస్తారని తెలిపారు. 7న మధుపాడ, 8న అలుగోలు, 9న పల్లిపేట, కొత్తూరు, 10,11న కొండవెలగాడ, 12న సతివాడ, 15న ఎంబేరయ్య గుళ్లు, 16న ఒమ్మి, 17న దన్నానపేట, 19న కోరాడ పేట, 21న రామతీర్థం, డి నెలివాడ, 22న సీతారామునిపేట, జగ్గరాజుపేట, 23న కొత్తపేట, అప్పయ్యపేట, 24న టొంపలపేట, సువ్వానిపేట, దీపిల్లిపేట, 25న తమ్మాపురం, 26న ఆల్తిపాలెం గ్రామంలో క్రాష్ ప్రోగ్రామ్ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ రాజు తెలిపారు. క్రాస్ ప్రోగ్రామ్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## కోడ్ ఎత్తేసారు.. గ్రీవెన్స్ యధాతదం: ఎంపీడీవో భాస్కరరావు!



మెరకముడిదాం, మార్చి 9, మేజర్‌న్యూస్

ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల దృశ్య ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి ప్రజా ఫిర్యాదులు వేదిక గ్రీవెన్స్ రద్దయిన విషయం పాఠకులకు తెలిసిందే. ఎన్నికల కోడ్ వచ్చిన నాటి నుండి కోడ్ ముగిసే వరకు ప్రజా ఫిర్యాదులు వేదిక గ్రీవెన్స్ ను రద్దు చేస్తున్నట్లు అప్పటిలో జిల్లా కలెక్టర్ వారు ఆదేశాలు ఇచ్చియున్నారు. అయితే ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసి ఫలితాలు కూడా వెలువడిన నేపథ్యంలో ఎన్నికల కోడ్ ను ఎత్తివేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ వారు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేసినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి గొర్లె. భాస్కరరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. అందు కారణంగా ఇంతవరకు ఆగిపోయిన గ్రీవెన్స్ అనగా ప్రజా ఫిర్యాదుల వేదిక ఇక నుంచి ప్రతి సోమవారం 10 గంటలకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో యధావిధిగా జరుగుతుందని ఎంపీడీవో భాస్కరరావు తెలియజేశారు.

## జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సన్నాహక సమావేశంలో పాల్గొన్న నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి

విజయనగరం టౌన్, మార్చి 9, మేజర్‌న్యూస్



ఈ నెల 14వ తేదీన పిఠాపురంలోని చిత్రాడ వద్ద జరిగే జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకను విజయవంతం చేయాలని విజయనగరం పార్లమెంట్ పరిశీలకులు, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే లోకం నాగమాధవి అధ్యక్షతన ఆదివారం విజయనగరం జిల్లా కేంద్రంలోని ఐఎంఏ పంక్షన్ హాలులో జనసేన ఆవిర్భావ దినోత్సవ సన్నాహక సభ జరిగింది. 100 పర్సంట్ స్ట్రైక్ రేట్ తో సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన తరువాత జరుగుతున్న జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకను విజయవంతం చేయాలని, విజయనగరం పార్లమెంట్ పరిశీలకులు, ఎమ్మెల్యే లోకం నాగ మాధవి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆవిర్భావ దినోత్సవ వేడుకకు విజయనగరం పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుండి అధిక సంఖ్యలో జనసైనికులు, వీర మహిళలు హాజరయి విజయవంతం చేయాలని కోరారు. ఆవిర్భావ దినోత్సవం జరిగే పిఠాపురం నియోజకవర్గంలోని చిత్రాడ వేధిక వద్ద లక్షలాదిగా తరలివచ్చే జనసైనికుల కోసం ఇప్పటికే అధిష్టానం ఏర్పాట్లు చేసిందన్నారు. మిగిలిన రాజకీయ పార్టీలకయితే జనాలను తరలించాలని, జనసేన పార్టీకైతే జనసైనికులు స్వతహాగా కదిలి వస్తారని అన్నారు. విజయనగరం పార్లమెంట్ నుండి అత్యధికంగా అవిర్భావ సభకు హాజరై జిల్లా సత్తాను చాటుదామని అన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆవిర్భావ దినోత్సవ పోస్టర్ ను విడుదల చేశారు. సమావేశంలో జనసేన నాయకులు, పిఓసిలు సభను విజయవంతం చేయాలని కేడర్ ను కోరారు. కార్యక్రమంలో విజయనగరం పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల పిఓసి లు, మండల నాయకులు, పట్టణ నాయకులు, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

## నేటి నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) పునః ప్రారంభం

విజయనగరం కార్పోరేషన్, మార్చి 9, మేజర్‌న్యూస్

ఈనెల 10వ తేదీ సోమవారం నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని పునః ప్రారంభిస్తున్నట్లు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో గత కొన్ని వారాలుగా పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని నిలిపివేసిన విషయం తెలిసిందే. ఎన్నికల కోడ్ ఎత్తివేయడంతో సోమవారం నుంచి యధావిధిగా గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని అర్జీదారులు వినియోగించుకోవాలని కమిషనర్ సూచించారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందని తెలిపారు.

## గంజాయి మత్తులో యువకులు హల్ చల్

### దొంగతనాలకు దాడులకు, పాల్పడుతున్న గంజాయి బ్యాచ్.. గ్రామస్తులు పట్టుకుని స్టేషన్కు అప్పగింత.. ఆందోళన చెందుతున్న పెదమానాపురం గ్రామస్తులు

దత్తిరాజేరు, మార్చి 9, మేజర్‌న్యూస్



మండలంలో పెదమనాపురం గ్రామంలో శనివారం రాత్రి గంజాయి మత్తులో పలువురు యువకులు హల్ చల్ చేశారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం రాత్రి శ్రీ వాసవి కళ్యాణ మండపం సమీపంలో కొందరు యువకులు జాతీయ రహదారి పక్కనున్న ఒడిస్సా దాబా వద్ద భోజనం చేసి వారికి బిల్లు చెల్లించకుండా, వారిపై దాడి చేసి సెల్ఫోన్ లాక్కొని హల్చల్ చేశారు. అనంతరం అర్ధరాత్రి సమయంలో గ్రామంలోని యాతి వీధిలో మరో ఇంటిపై దాడికి యత్నించగా ఇంట్లో వారు చుట్టుపక్కల వారికి ఫోన్ చేయగా యువకులు వెంబడించి పట్టుకోవడం జరిగింది. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం చేరవేసి వారిని స్టేషన్కు అప్పగించడం జరిగింది. ఇటీవల కాలంలో పెదమానాపురం, సంత తోట పరిసర ప్రాంతాలలో తరచూ దొంగతనాలకు పాల్పడుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా శనివారం రాత్రి మరో సంఘటన చోటు చేసుకోవడంతో స్థానికుల భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి గంజాయి మత్తులో దాడులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## స్పీకర్ అయ్యన్న పాత్రుడు చేతుల మీదుగా ఉత్తమ మహిళ అవార్డు స్వీకరించిన డా. ప్రశాంతి



నర్సీపట్నం, మార్చి 8, మేజర్‌న్యూస్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని, వైద్య ఆరోగ్య శాఖలో విశేష సేవలు అందజేసిన డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం మేనేజ్మెంట్ ఆఫీసర్ డాక్టర్ జె.ప్రశాంతి ఉత్తమ మహిళా అవార్డును అందుకున్నారు. ఈమె ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లాలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి ఎంతో పురోగతిని సాధించారు. ఈ మేరకు ఆమె అనకాపల్లిలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సీఎం.రమేష్ చేతులు మీదుగా ఉత్తమ మహిళా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఉత్తమ మహిళా అవార్డు గ్రహీత డాక్టర్ ప్రశాంతిని జిల్లాలోని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## రవీంద్ర భారతిలో ఘనంగా వీడ్కోలు వేడుక



నరసన్నపేట, మార్చి 9, మేజర్‌న్యూస్

నరసన్నపేట రవీంద్ర భారతి పాఠశాల వీడ్కోలు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తమ చదువును పూర్తి చేసుకొని తోటి విద్యార్థులకు టీచర్లకు విద్యాసంస్థకు వీడ్కోలు చెప్పాల్సి వస్తుంది. ఈ సందర్భాన్ని ప్రతి విద్యార్థి ఎదుర్కోక తప్పదు. ఈ వేడుక చాలా ఉద్వేగ భరితంగా సాగుతుంది. ఎందుకంటే విద్యార్థులకు ఆ విద్యా సంస్థతో టీచర్లతో, ఉపాధ్యాయులతో, ఒక అనుబంధం ఏర్పడుతుంది. ఆ మధురమైన జ్ఞాపకాలు నింపుకొని బయటకి అడుగుపెడుతున్న వారికి మిగిలిన విద్యార్థులు వీడ్కోలు చెప్పడం జరుగుతుంటుంది. వీడ్కోలు చెప్పడం అంటే సంతోషం, బాధల మిశ్రమ సందర్భం అని చెప్పుకోవాలి. ఒకే సమయంలో సంస్థను తమను విడిచి వెళ్ళిపోతున్నామని బాధ, జీవితంలో ముందుకు సాగుతున్నామనే సంతోషం రెండు ఉద్వేగాలు కలుగుతాయి. ఇలాంటి సమయంలో చాలా హుందాగా ప్రభావంతంగా ఉండాలి. భవిష్యత్తును ఆనందమయంగా మార్చుకునేందుకు చాలా శ్రమ పడాలి, కష్టపడాలి. విద్యార్థుల్లో ఉండే ప్రతిభకు మరింత పదును పెట్టాలి. భవిష్యత్తు అంటే భయపడాల్సిన విషయం కాదు. కానీ పాఠశాల అనుభవం విద్యార్థుల స్నేహం,ఉపాధ్యాయులు నేర్పినటువంటి విద్యా బోధన మీయొక్క భవిష్యత్తుకు అండగా నిలబడతాయి. ప్రతి ఒక్క విద్యార్థి కూడా ఆత్మవిశ్వాసాన్ని నింపుకొని జీవితంలో ఎలాంటి సవాలు అయినా సులభంగా ఎదుర్కోగలటువంటి ప్రయత్నాన్ని ప్రతి ఒక్క విద్యార్థి సాధించాలి.మీరుఅందరు మంచి భవిష్యత్తును పొందాలని, పదవ తరగతి పరీక్షల్లో అద్భుతమైన ఫలితాలను సాధించాలని ఆశిస్తూ,ఆశీర్వ దిస్తున్నాను అని పాఠశాలల చైర్మన్ ఎం.ఎస్. మణి అన్నారు.ఉపాధ్యాయులు నిజానికి ఎప్పుడూ కఠినంగా ఉండరు. కోపం లేనప్పుడు తమ ఔదార్యాన్ని చూపిస్తూ మీ భవిష్యత్ కోసమే శ్రమిస్తారు అని నార్త్ ఆంధ్ర జోన్ జోనల్ ఇన్చార్జి ఎన్.వెంకటేష్ అన్నారు. మా విధులను నిర్వర్తించేటప్పుడు మేము కొన్నిసార్లు కఠినంగా ఉన్నప్పటికీ, భవిష్యత్తులో వచ్చే అన్ని రకాల పరిస్థితులకు మిమ్మల్ని సిద్ధం చేయాలనే ఉద్దేశ్యంతోనే మేము అలా చేసామని,జీవితం ఎల్లప్పుడూ సజావుగా ఉండకపోవచ్చుబీ కాబట్టి మీరు సవాళ్లను మరియు వివాదాలను ఎలా అధిగమించాలో కూడా తెలుసుకోవాలి అని రవీంద్రభారతి పాఠశాలల సీ.జీ.యం.జీ ఆర్.వసంత అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ధర్మానవాసుదేవరావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో అలరించాయి.

## శిష్టకరణ సంఘ అధ్యక్షునిగా సదాశివుని రాంబాబు..

నరసన్నపేట, మార్చి 9, మేజర్‌న్యూస్



నరసన్నపేట శిష్టకరణ సంఘ అధ్యక్షులుగా సదాశివుని రాంబాబు ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. ఆదివారం నిర్వహించిన సంఘ సభ్యుల సమావేశంలో సభ్యులు అందరి ఆమోదంతో సంఘ అధ్యక్షులు బాధ్యతను స్వీకరించిన రాంబాబు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకముతో సంఘ సభ్యులు అందించిన ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి శిష్టకరణ సామాజిక వర్గ అభివృద్ధికి కృషి చేస్తానని శిష్టకరణ సంఘ నూతన అధ్యక్షులు సదాశివుని రాంబాబు అన్నారు. ఓ బి సి సాధనకు కృషి చేస్తున్న కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు నరసన్నపేట శిష్ఠకరణ సంఘం తరపున అభినందనలు తెలియజేశారు. ఎన్డీఏ ప్రభుత్వ హయాంలోనే ఓబిసి సాధిస్తామని, శిష్టకరణ సామాజిక వర్గంలో నిజమైన పేదలకు గృహనిర్మాణం, విద్య, వైద్య విషయాల్లో సహకారం అందిస్తామని రాంబాబు అన్నారు .ఈ కార్య క్రమంలో సదాశివుని కృష్ణ, ఆర్. బుజ్జి, కస్పా ప్రసాద్, బురవెల్లి భాస్కర రావు, ఆర్ వి శోభ, రమణయ్య, లక్మి, అంపలాం వసంత, ఏపీవీ రమణమూర్తి, డి. రఘు, 50 మంది సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.



**చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా అంగన్వాడీ వర్కర్స్ యూనియన్, పార్వతిపురం మన్యం జిల్లా కార్యదర్శి గంట జ్యోతిలక్ష్మిని హౌస్ అరెస్ట్ చేసిన వైనం. (మేజర్‌న్యూస్-పార్వతీపురం)**

## ఉక్కు సత్యాగ్రహం సినిమా శత దినోత్సవ వేడుకల సంబరాలు

### ఇండియా ద గ్రేట్ బాలీవుడ్ చిత్ర నిర్మాణం త్వరలో విశాఖలో ఒక ఫిలిం స్టూడియో ఏర్పాటు : నిర్మాత సత్యారెడ్డి వెల్లడి



విశాఖపట్నం, మార్చి 9, మేజర్‌న్యూస్

ఇండియా గొప్పతనం ప్రపంచానికి చాటి చెప్పేందుకు త్వరలో ఇండియా ద గ్రేట్ బాలీవుడ్ చిత్రాన్ని ప్రముఖ నటీ నటులతో నిర్మిస్తున్నట్టు హీరో, దర్శక, నిర్మాత, జనంస్టార్ సత్యారెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా నంది అవార్డు గ్రహీత, ప్రముఖ దర్శక నిర్మాత కారెం వినయ్ ప్రకాష్ ఆధ్వర్యంలో పౌర గ్రంధాలయంలో జరిగిన కార్యక్రమంలో సత్యారెడ్డిని వెండి కిరీటం పెట్టి శాలువా, గజమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సత్యారెడ్డి మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజాయుద్ధనౌక గద్దరన్న ప్రధాన పాత్రలో ఈ చిత్రాన్ని నిర్మించినట్టు తెలిపారు. తెలుగు ప్రజల జీవనాడి విశాఖ స్టీల్ లాంటి కోసం గద్దర్ లాంటి లెజెండ్‌తో ఉక్కు సత్యాగ్రహం చిత్రాన్ని నిర్మించి ప్రపంచ వ్యాప్తంగా 150 థియేటర్లో విడుదల చేసినట్టు పేర్కొన్నారు. కొన్నిచోట్ల శత దినోత్సవాలు జరుపుకోవటం ఆనందంగా ఉందన్నారు. విశాఖలో ఒక ఫిలిం స్టూడియోని నిర్మించే ఆలోచన తనకి ఉందని చెప్పారు. ఈ స్టూడియో ద్వారా కొత్త కళాకారులని ప్రోత్సహిస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, సీనియర్ నటుడు, జీవీఎంసీ బ్రాండ్ అంబాసిడర్ ప్రసన్న కుమార్, ప్రముఖ సినీ నిర్మాత కారం మమత, ప్రముఖ గే రచయిత గాయకులు మజ్జి దేవిశ్రీ, ప్రముఖ సినీ దర్శకులు రాకేష్ రెడ్డి, యాది కుమార్, శుభశ్రీ అన్నె ఇవాంజెలిన్ తో బాటు ప్రముఖ దర్శక, నిర్మాతలు నటీనటులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ కార్మికురాలికి ఏఎస్ఐ గోవిందమ్మ సత్కారం

విశాఖపట్నం, మార్చి 9, మేజర్‌న్యూస్



తన 40ఏళ్ల సర్వీస్‌లో తానెన్నో పురస్కారాలు, అవార్డులు అందుకున్నానని మహిళా ఏఎస్ఐ గోవిందమ్మ గుర్తు చేసుకున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా తనకెన్నో కార్యక్రమాలకు ఆహ్వానం అందిందని, కానీ రోడ్లను శుభ్రం చేస్తూ నిత్యం ప్రజలకు అందుబాట్లో ఉండే పారిశుద్ధ్య కార్మికుల్ని ఎవరు పట్టించుకుంటారని ఆమె ప్రశ్నించారు. అందుకే తమ పరిసర ప్రాంతాల్లో కష్టపడి పని చేస్తున్న జీవీఎంసీలోని పారిశద్ధ్య కార్మికురాలు బంగారమ్మను ఘనంగా సత్కరించానన్నారు. బంగారమ్మకు శుభాకాంక్షలు తెలియజేస్తూ దుశ్శాలువాతో సత్కరించి, పుష్పాలంకరణతో అభినందించారు. బంగారమ్మ కూడా ఏఎస్ఐ గోవిందమ్మకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## విశాఖ తీరంలో 'మూన్ పవర్ రియల్ ఎక్స్ పో' .. ప్రారంభించిన అంజిబాబు



విశాఖపట్నం, మార్చి 9, మేజర్‌న్యూస్

విశాఖలో రియల్ బూమ్ మరింత విస్తరిస్తోందని, ఆర్థిక రాజధాని విశాఖపైనే అందరూ ఆశలు పెట్టుకున్నారని ప్రకృతి అవెన్యూస్ సంస్థ అధినేత అంజిబాబు అభిప్రాయపడ్డారు. సొంతింటి కల నెరవేర్చే దిశగా విశాఖ తీరంలో శనివారం 'మూన్ పవర్ రియల్ ఎక్స్‌పో'ను ఆయన చేతుల మీదుగా శనివారం ప్రారంభించారు. అనేక రియల్ ఎస్టేట్ కంపెనీలు ఇక్కడ కొలువుదీరాయి. రెండ్రోజుల పాటు ఈ ఎక్స్‌పో ఉంటుందని, సొంతిల్లు నిర్మించుకుందామనుకునే వారికి ఈ ఎక్స్‌పో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సీనియర్ ఈవెంట్ మేనేజర్, మూన్ పవర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఎక్స్‌పో అందరికీ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి డైరెక్టర్ పరశురాం, డ్రీమ్ షెల్టర్స్ సంస్థ అధినేత రవిశంకర్, మ్యాన్ పవర్ శ్రీనివాస్, ఆయన బృంద సభ్యులు ఆది, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

మధురవాడ, మార్చి 9, మేజర్‌న్యూస్



రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వం ఇల్లు లేదా ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు పోతుమహంతి నారాయణ్ డిమాండ్ చేశారు.ఆదివారం మధురవాడ లోని జాతరలో ఏపీడబ్ల్యూజేఎఫ్ మధురవాడ యూనిట్ 2025కు చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణ్ మాట్లాడుతూ జర్నలిస్టులకు వృత్తిపరంగా రక్షణ కల్పించాలని, పింఛన్లు, అక్రిడేషన్లు, బీమా సౌకర్యం ఏర్పరచాలని కోరారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ విశాఖపట్నం జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఏ. సాంబశివరావు మాట్లాడుతూ మధురవాడ,ఆనందపురం, భీమిలి ప్రాంత జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, అదేవిధంగా మధురవాడ ప్రెస్ క్లబ్ కు కూడా స్థలం కేటాయించాలని కోరారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.రవికుమార్ మాట్లాడుతూ వార్తలు రాసే జర్నలిస్టులపై దాడులకు దిగడం సరికాదని ఇటీవల గాజువాకలో జరిగిన సంఘటనను తీవ్రంగాఖండించారు. ఫెడరేషన్ జాయింట్ సెక్రెటరీ గొడబ రాంబాబు ఇంటిపై కొందరు దుండగులు దాడి చేయడం దానిపై దువ్వాడ పోలీస్ స్టేషన్లో కృష్ణ నమోదు చేశామని దోషులను తక్షణం అరెస్టు చేయాలన్నారు. త్వరలో రాష్ట్ర మహాసభలు విశాఖపట్నంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.ఆనంద్ తన స్వాగత ఉపన్యాసంలో మధురవాడ ఏరియాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.ఈ నెల 28న విశాఖపట్నం లో నిర్వహిస్తున్న ఉగాది సంబరాల్లో జర్నలిస్టులు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు బొక్కా త్రిమూర్తులను ఘనంగా సన్మానించారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కోశాధికారి బి. సీతారామమూర్తి, ఫెడరేషన్ ప్రతినిధులు నెలరాజు, రాజారావు, శ్రీహరి, గణేష్, సాయిగుణ, రంజన్,వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ స్టేడియంలో కోచెస్, రిఫరీ జడ్జింగ్ సెమినర్

నర్సీపట్నం, మార్చి 9, మేజర్‌న్యూస్



కోచెస్, రిఫరీ జడ్జింగ్ సెమినర్ నర్సీపట్నం ఎన్టీఆర్ స్టేడియం లో నిర్వహించారు. నింజాస్ అకాడమీ ఆధ్వర్యంలో వుషు బాక్సింగ్ థాయికొండో కిక్ బాక్సింగ్ గేమ్స్ లలో సెమినర్ నియోజకవర్గ లెవెల్ వీటిని నిర్వహించారు దీనిలో తోట ప్రసాద్, మునికోటి విజయ్, రాజేశ్వరీ,. అర్జున్ రెడ్డి, ప్రియాంక, సీనియర్ నేషనల్ బాక్సర్ మౌనిక లు పాల్గొన్నారని సీనియర్ కోచ్ యర్రా శేఖర్ తెలిపారు. వీరికి వెలగా నారాయణరావు స్పోర్ట్స్ టీ షర్టులు భోజన వసతి అందించారు రిఫరీ జడ్జి సెమినర్ జిల్లా స్థాయిలో జరుగుతాయని తెలిపారు. దీనికి జిల్లా స్థాయి అన్ని మండల స్థాయిల నుండి జూనియర్ సీనియర్ కోచ్‌లు పాల్గొంటారని శేఖర్ తెలిపారు వీటికి శాప్ కోచ్ అబ్బు వీరికి సెమినర్‌లో గేమ్స్ రూల్స్ రెగ్యులేషన్స్ వాటి కోసం వివరించి ట్రైనింగ్ న్యుట్రిషన్ స్పోర్ట్స్ సైకాలజీలో క్రీడాకారులకు కోచెస్‌కు శిక్షణ ఇచ్చారని శేఖర్ తెలిపారు. దీనితో పాటు స్టూడెంట్స్ కు వివిద వుషు బాక్సింగ్ కరాటే లో సెలెక్షన్స్ నిర్వహించి సర్టిఫికెట్స్ కూడా అందజేశారు.

## డీఎస్పీ శ్రీనివాసరావు చేతుల మీదుగా టీచర్ భారతికు ఘనసత్కారం

నర్సీపట్నం, మార్చి 9, మేజర్‌న్యూస్




అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పిఆర్‌టియు ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నర్సీపట్నం డి.ఎస్.పి శ్రీనివాసరావు చేతుల మీదుగా నాతవరం మండలం గన్నవరం మెట్ట ఎంపీపీ స్కూల్ టీచర్ భారతిను ఘనంగా సత్కరించారు. సీనియర్ ఉపాధ్యాయురాలు భారతి అంకితభావంతో పనిచేస్తూ అధికారులు నాయకులు మన్ననలు పొందుతూ ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దునందుకు డిఎస్పి అభినందించారు. ఈ సందర్భంగా డిఎస్పి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైనదని ఎంతోమంది ఉన్నత స్థితికి కారణం ఉపాధ్యాయ వృత్తిని ఆయన తెలిపారు. చదువుకున్న రోజుల్లో ఉపాధ్యాయుడిగా స్థిరపడాలని అనుకున్నానని అన్నారు. టీచర్ అవ్వాలన్న కోరిక ఉండిపోయిందని అన్నారు. సన్మాన గ్రహీత భారతి మాట్లాడుతూ మహిళలు అందరికీ ఉమెన్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థిని విద్యార్థులు ను తీర్చిదిద్దడంలో తల్లి దండ్రుల బాధ్యత చాలా ఎక్కువగా ఉందని యువత ముఖ్యంగా సెల్‌ఫోన్ బారిన పడకుండా జాగ్రత్తగా చూసుకోవాలని. పిల్లలు సెల్‌ఫోన్లో ఏమి చూస్తున్నారు ఏమి మాట్లాడుతున్నారు గమనించాలని తెలిపారు. విద్యార్థులు హెయిర్ స్టైల్ మార్చాలని. దానికి అందరూ కృషి చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలోపిఆర్ టి యు అధ్యక్షులు గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## నూకాంబిక ఆలయ కమిటీ మహిళలకు చీరలు పంపిణీ

గాజువాక, మార్చి 9, మేజర్‌న్యూస్



మహిళా దినోత్సవం సందర్భంగా 74 వార్డు దయాల్ నగర్ క్వారీ రోడ్డు లో ఉన్నటువంటి స్వర్ణ నూకాంబిక ఆలయం మహిళా కమిటీ సభ్యులకు చీరలు పంపిణీ చేశారు. మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం దయాల్ నగర్ క్వారీ రోడ్‌లో ఉన్న స్వర్ణ నూకాంబిక అమ్మవారి ఆలయ కమిటీలో ఉన్న మహిళలందరికీ 74 వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీ రెడ్డి చిరు కానుకగా మహిళలకు చీరలు అందజేశారు. ఈ సందర్భంగా వంశి రెడ్డి మాట్లాడుతూ స్వర్ణ నూకాంబిక అమ్మవారి ఆశీస్సులు మహిళలందరి పైన, గ్రామస్తులు, గాజువాక నియోజవర్గం ప్రజలందరి పైన ఉండాలని ఆయురారోగ్యాలతో ప్రజలందరూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో స్వర్ణ నూకంబిక మహిళా కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్యుని దర్శించుకున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి దంపతులు..

నరసన్నపేట, మార్చి 9, మేజర్‌న్యూస్



నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి, సుగుణమ్మ దంపతులు వివాహ వార్షికోత్సవం సందర్భంగా అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామిను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఎమ్మెల్యే దంపతుల 42వ వివాహా వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర్ శర్మ ఎమ్మెల్యే దంపతులకు ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాది తన వివాహ రోజున స్వామివారిని దర్శించుకోవడం గత 42 సంవత్సరాలుగా కొనసాగుతుందని పేర్కొన్నారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

## లైంగిక నేరాలు రక్షణ చట్టం న్యాయ విజ్ఞాన సదస్సు

ఆనందపురం, మార్చి 9, మేజర్‌న్యూస్



ఆనందపురం మండలంలో ఆదివారం ఆరెంజ్ కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విశాఖపట్నం ఏడవ అదనపు మెజిస్ట్రేట్ సీనియర్ సివిల్ జడ్జ్ ఏ రాధాకృష్ణ పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ న్యాయ విజ్ఞాన సదస్సు పిల్లలకు రక్షణ చట్టం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, మండల విద్యాశాఖ అధికారి జోగేందర్, ఐసిడిఎస్ అధికారి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఛత్తీస్గఢ్ తెలుగు మహాసభల్లో ఉత్తరాంధ్ర జానపదాలు

### ఏపీ జానపద కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి కుమార్‌నాయక్

పలాస, మార్చి 9, మేజర్‌న్యూస్



రాయపూర్ ఛత్తీస్గడ్ తెలుగు ద్వితీయ మహాసభల్లో పలాస ప్రాంతానికి చెందిన కళాకారుల బృందం పలు జానపద పాటలతో సభను ఉర్రూతలూగించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో నోము నో మన్నాల తుమ్మెదలా, మేము కళాకారులం, మందులోడా, వాకిట పూసిన వాడంబరాలు, వెళ్లిపోతావ్ రా మనిషి,చిన్నక్కో ఉద్దానం చూడు అను పలు పాటలతో చతిస్గడ్ తెలుగు ప్రజలకు ఆనంద డోలికలు కలిగించారు. గిడుగు రామ్మూర్తి కళాపీఠం కన్వీనర్ సిస్టు మనోజ్ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ జానపద కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి కుమార్ నాయక్,ప్రముఖ రచయిత వంకల రాజారావు,అరుణోదయ సేవా సంఘ కార్యదర్శి సొర్ర రామారావు కోరస్ వాయిద్య సహకారాన్ని అందించారు.

## బిసి స్టడీ సర్కిల్లో డిఎస్సీ కోసం ఉచిత ఆన్లైన్ శిక్షణ

శ్రీకాకుళం, మార్చి 9, మేజర్‌న్యూస్



మెగా డిఎస్సీ పరీక్షకు అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్ బిసి స్టడీ సర్కిల్ ఉచిత ఆన్లైన్ శిక్షణ ఇవ్వనుంది. వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ సంచాలకులు విజయవాడ వారి ఆదేశాల మేరకు ఈ శిక్షణను ప్రారంభించనున్నట్లు బిసి స్టడీ సర్కిల్ శ్రీకాకుళం సంచాలకులు ఇ.అనురాధ తెలిపారు. టెట్ (టీచర్ ఎలిజిబిలిటి టెస్ట్) పరీక్షలో అర్హత సాధించిన శ్రీకాకుళం జిల్లాలోని బిసి, ఈబీసీ కేటగిరికి చెందిన అభ్యర్థులు ఈ ఉచిత ఆన్లైన్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల ఎంపిక టెట్ పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా జరుగుతుంది. ఆసక్తి గల అభ్యర్థులు తమ 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ మార్కుల జాబితాలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు (2 లక్షల లోపు), టెట్ మార్కుల జాబితా, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులో టిడిపి భవనం వెనుక ఉన్న ఎపి బిసి స్టడీ సర్కిల్ కార్యాలయంలో మార్చి 10వ తేదీ నుండి నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాల కోసం 7382975679, 9295653489 నంబర్లను సంప్రదించవచ్చు.

## ఆతిథ్యం హెూటల్ నూతన ప్రారంభం

విశాఖపట్నం, మార్చి 9, మేజర్‌న్యూస్



సరికొత్త అభిరుచుల కొరకు విశాఖ వాసుల కోసం సరికొత్త రుచుల్ని పరిచయం చేసేందుకు నేడు విజయలక్ష్మి మున్నంగి. శ్రీ మణికంఠ స్వామి సంయుక్త భాగస్వామ్యంలో అతి ఘనంగా బొత్స సురేష్ కుమార్, డా.రామ్‌కుమార్ (లక్ష్మి గాయత్రీ హాస్పిటల్స్ అధినేత)చే ప్రారంభమైన 'ఆతిధ్యం' హెూటల్ నూతనంగా రామా టాకీస్ నందు ప్రారంభం అయింది. విశాఖ వాసులు కోసం రకరకాల వంటకాలతో ఆతిధ్యం' హెూటల్ అందిచనుంది. ప్రతి ఒక్కరు మాయొక్క హెూటల్‌కి విచ్చేసి మమ్మలిని అందరి ఆదరాభిమానాలుచూరగొనాలని ఆశిద్దాం..

## ఘనంగా వమ్మలి కాటా దగ్గర శ్రీశ్రీ మోదకొండమ్మ పాదాల తీర్థ మహెూత్సవం

వి.మాడుగుల, మార్చి 9, మేజర్‌న్యూస్



వమ్మలి గ్రామంలోశ్రీ శ్రీ మోదకొండమ్మ అమ్మవారి పాదాలు తీర్థ మహెూత్సవం ఘనంగా నిర్వహించారు ఉదయం నుండి అమ్మవారి పాదాల దగ్గర భక్తులు పాలాభిషేకాలు కుంకుమ పూజ చిటికల భజనలతో కోలాటాలతో మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు అనం తరం జిల్లాస్థాయి గుర్రం పోటీలు నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఆలయ అభివృద్ధి కమిటీ మరియు గ్రామ పెద్దలు యువకులు సహాయ సహకారాలతో అంగ రంగ వైభవంగా నిర్వహించారు.

## అసంఖ్యాక ఆభరణాలకు చిరునామా వైభవ్ జ్యూయలర్స్

### కొనుగోలు దారులు విశ్వాసానికి ప్రతీక వైభవ్ జ్యూయలర్స్.

### తెదేపా పలాస నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి




పలాస, మార్చి 9, మేజర్‌న్యూస్

అసంఖ్యాక,నాణ్యత,నమ్మకానికి ప్రతీక,బంగారు ఆభరణాలకు చిరునామా వైభవ్ జ్యూయలర్స్ అని తెదేపా పలాస నియోజకవర్గ సమన్వయకర్త వై వెంకన్న చౌదరి అన్నారు.కాశీబుగ్గ పాత బస్టాండ్ సమీపంలో వైభవ్ జ్యూయలర్స్ బంగారు ఆభరణాలు షో రూమ్‌ను ఆదివారం వెంకన్న చౌదరి చేతులు మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా షో రూమ్ నిర్వాహకులు మాట్లాడుతూ కోస్తా ఆంధ్రా, తెలంగాణలో ప్రముఖ ప్రాధాన్యత కలిగి వినియోగదారుల ఆదరాభిమానాలతో విశాఖపట్నం, గాజువాక, గోపాలపట్నం, అనకాపల్లి, కాకినాడ, రాజమహేంద్రవరం, తుని,పార్వతీపురం,బొబ్బిలి,శ్రీకాకుళం, విజయనగరం, రాజాం,అనంతపురము, అమలాపురం, యలమంచిలి, దిల్ షుక్ నగర్, ఎ.ఎస్.రావ్ నగర్ అలాగే మంచిర్యాలలో 18 బ్రాంచీలతో వైభవ్ జ్యూయలర్స్ (మనోజ్ వైభవ్ జెమ్స్ 'ఎన్' జ్యూయలర్స్ లిమిటెడ్) ప్రసిద్ది పొందిందని చెప్పారు.ఉత్తమ నాణ్యత మరియు అనువైన ధరలతో విభిన్న డిజైన్లలో బంగారు ఆభరణాలు,వజ్రాభరణములు, రత్నాలు మరియు వెండి ఆభరణములు, పూజా వస్తువులుతో అసంఖ్యాక ఆభరణాల శ్రేణి కలిగి, అసాధారణ అమ్మకాలతో కస్టమర్ల ఆమోదం పొందిన విషయం స్వర్ణాభిమానులకు తెలిసిన విషయమే అని అన్నారు.పలాసలో ఆదివారం వైభవ్ జ్యూయలరీ 19వ షోరూమ్ ను ప్రత్యేక అతిథిలు వెంకన్న చౌదరి, మళ్ళా కాంతారావు ప్రారంభించగా,వైభవ్ సంస్థల సి.ఎమ్.డి శ్రీమతి భారత మల్లికా రత్న కుమారి గ్రంధి,హెూల్ టైమ్ డైరెక్టర్, సాయి కీర్తన గ్రంధి, సి.ఓ.ఓ గొంట్ల రాఖాల్,ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింధూరి వెంకటేష్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.ఈ సంధర్భంగా విశిష్ట అతిధులు మాట్లాడుతూ వైభవ్ జ్యూయలర్స్ తమ విస్తృతమైన శ్రేణి, అద్భుతమైన పనితనంగల బంగారు ఆభరణాలను ఇప్పుడు పలాస, చుట్టు ప్రక్కల ఉన్న వినియోగదారులకు అందించటం శుభపరిణామమని, అభినందనీయమని ప్రశంసించారు. ఈ సంధర్భంగా వైభవ్ సంస్థ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్,జె.రఘునాధ్ మాట్లాడుతూ వినియోగదారులకు అద్భుత శ్రేణి షాపింగ్ అనుభవంతో పాటు విస్తృత శ్రేణిలో 916 హాల్ మార్క్ బంగారు ఆభరణాలు,సర్టిఫైడ్ డైమండ్స్,సాధారణ వెండి వస్తువులు మరియు వెండి వివాహ ఆభరణములు అందించాలనే ఉద్దేశ్యంతో నేడు తమ వైభవ్ జ్యూయలరీ 19వ షోరూమ్‌ను పలాసలో ప్రారంభించుచున్నామని తెలియజేశారు. ప్రారంభోత్సవ కానుకగా బంగారు ఆభరణములపై తరుగు 6.9 శాతం మరియు సాధారణ వెండి వస్తువులు, పట్టీలపై తయారీ ఛార్జీలు లేకుండా మరియు మార్చి 09 నుండి మార్చి 30 వరకు ప్రతీ రూ.9999లు కొనుగోలుపై ఒక కూపన్ పొంది, డ్రాలో 2 హెూండా యాక్టీవా 110సిసి స్కూటర్లు ఇద్దరు విజేతలకు గెలుచుకొనే అవకాశం తమ పలాస షోరూమ్ లో అందిస్తున్నామని, వినియోగదారులు తమ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ సంధర్భంగా జరిగిన 'మన పలాస గురించి తెలుసుకుందాం కాంటెస్ట్' డ్రాలో గెలుపొందిన 7 మంది విజేతలకు (ఒక్కొక్కరికి 1 గ్రాము 22 క్యారెట్ బంగారు కాయిన్)లను అందజేస్తున్నామని తెలిపారు.కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త మల్లా కృష్ణారావు,పలాస ఏఎంసీ మాజీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు,తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీరికట్ల విఠల్ రావు,లొడగల కామేశ్వరరావు, మలిపెద్ది నరేంద్ర కుమార్ (చిన్ని) సప్ప నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ జ్ఞాన జ్యోతి పాఠశాల 28వ వార్షికోత్సవం

### - 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుక..






నరసన్నపేట, మార్చి 9, మేజర్‌న్యూస్

నరసన్నపేట పట్టణంలోని శ్రీ జ్ఞానజ్యోతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఆదివారం 28వ వార్షికోత్సవ దినోత్సవం, 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకను ఒక ప్రైవేట్ కళ్యాణమండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ వైద్యులు పొన్నాడ గణేష్ హాజరైనారు ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉత్తమ పౌరులుగా రాణించాలని, భావి జీవితాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బోరుభద్ర పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, ఉపాధ్యాయులు కేశవరావు, కుమార్, సాయి శర్మ విద్యార్థులు ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, ఉత్తమ పౌరులుగా సామాజిక బాధ్యత మెలగాలని, చదువుకున్న విద్యాసంస్థలకు గుర్తింపు తీసుకొచ్చే బాధ్యతను కొనసాగించాలని అన్నారు. అనంతరము ఆరవ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు వివిధ రకాల సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ జ్ఞాన జ్యోతి స్కూల్ మేనేజ్మెంట్ సభ్యులు వెలమల భాస్కరరావు, బోర రామారావు, తర్ర సత్యనారాయణ, పాగోటి లక్ష్మి ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ ఆలయానికి ఫ్యాన్ వితరణ

రోలుగుంట (రావికమతం), మార్చి 9, మేజర్‌న్యూస్



కొంతలం పంచాయితీ పాపంపేట గ్రామానికి చెందిన నూతనంగా నిర్మించిన ముత్యాలమ్మ ఆలయానికి అమ్మిరెడ్డి రమణ ఆదివారం ఫ్యాన్ వితరణగా అం దించారు. బుచ్చింపేట గ్రామానికి చెందిన అమిరెడ్డి రమణ తన ఆదాయంలో కొంత భాగాన్ని సేవ కార్యక్రమానికి వినియోగిస్తున్నారు వినియోగస్తున్నారు. పాపంపేట గ్రామంలో నిర్మించిన ఆలయన్ని సందర్శించిన రమణ ఆలయ గర్భగుడిలో ఫ్యాన్ అవసరమని గుర్తించి దీనిని సమాకుర్చెరు. ఇతని సేవా నిరతిని పాపంపేట గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

## రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వ విద్యాలయంలో ఘనంగా ముగిసిన టెక్ ఫెస్ట్

శ్రీకాకుళం, మార్చి 9, మేజర్‌న్యూస్



రాజీవ్ గాంధీ విజ్ఞానిక విశ్వవిద్యాలయం శ్రీకాకుళంలో జాతీయ టెక్నో మేనేజ్‌మెంట్ ఫెస్ట్ (టెక్నివర్స్ 2025) జాతీయ టెక్నో మేనేజ్‌మెంట్ ఫెస్ట్ (టెక్నివర్స్ 2025) మూడవ రోజు ఘనంగా వేడుకలు ముగిశాయి. డైరక్టర్ ప్రొఫెసర్ ఆచార్య కొక్కిరాల వెంకట ధన బాలాజీ, పరిపాలనా అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహనకృష్ణ చౌదరి స్టాల్స్‌ని సందర్శించారు. ఈ టెక్ని వర్స్‌లో ఐఐటి గువహతి, ఐఐటి తిరుపతి, ఐఐటి హైదారాబాద్, ఐఐటి మద్రాస్, ఐఐటి జోధ్పూర్, ఐఐ టి భువనేశ్వర్, ఇస్రో నుంచి ఎన్ఐ టి నాగపూర్ ప్రొఫెసర్లు లెక్చర్స్ ఏఐ మీద, సెన్సార్ మీద, హైడ్రాలజీ మీద, మెకానికల్ బిహేవియర్ ఆఫ్ హై టెంపరేచర్ అల్లాయ్స్ మీద, వివిఎల్ఎస్ఐ, పవర్ ఎలక్ట్రానిక్స్ మీద, ఉపన్యాసాలు ఇవ్వడం జరిగింది. ఈ టెక్ని వెర్స్‌లో డిపార్టుమెంటల్ వర్క్ షాప్స్, టెక్నికల్ క్విజ్, రోబోటిక్స్, టెక్నికల్ పేపర్ ప్రెజెంటేషన్ ఇలా 50 పైబడి ఈవెంట్స్ జరిగాయి. విద్యార్థులుకు ఐఐటి ఇస్రో నుండి వచ్చిన ఉత్తమ ప్రొఫెసర్‌లతో సెమినార్ నిర్వహించటం సాయంత్రం సాంఘీక, సాంస్కృతిక కార్యక్రమాలు కార్యక్రమంములు జరిపించటం జరిగాయి.సెమినార్ ఈవెంట్‌కి మేజర్‌గా స్పాన్సర్లు చేసిన కెనరా బ్యాంక్, లియో గ్లోబల్ ఓవర్సీస్, ట్రేడ్ మిలాన్, యూనియన్ బ్యాంక్ మరియ ఏటా అత్తర ఇన్నోవేషన్‌కి సహాయ సహకారాలు అందించినందుకు క్యాంపస్ తరుపున ధన్యవాదాలు తెలిపారు. ఈ టెక్నివెర్స్‌కి కన్వీనర్ డీన్ వెల్ఫేర్ గేదల రవి, కొ-కన్వీనర్ సివిల్ విభాగపతి సిహెచ్ తేజ కిరణ్ ఉన్నారు. ఈ కార్యక్రమానికి డైరక్టర్ ప్రొఫెసర్ బాలాజీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ముని రామకృష్ణ, డీన్ అకడమిక్స్ కొర్ల మోహన్ కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ సిహెచ్ వాసు, అకౌంట్స్ ఆఫీసర్ కె.మోహన రావు, పిఆర్ఓ మామిడి షణ్ముఖ, వివిధ డిపార్టుమెంట్ విభాగపతులు, బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బంది, విద్యార్దులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల

శ్రీకాకుళం, మార్చి 9, మేజర్‌న్యూస్



జిల్లాలోని సెకండరీ హెల్త్ ఆసుపత్రులలో కాంట్రాక్ట్/ అవుట్ సోర్సింగ్ పద్ధతిలో వివిధ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. అర్హులైన అభ్యర్థులు మార్చి 10, నుండి మార్చి 15, 2025 సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. థియేటర్ అసిస్టెంట్, ఆడియోమెట్రీషియన్, ఎలక్ట్రీషియన్, జనరల్ డ్యూటీ అటెండర్, ప్రింటర్ వంటి వివిధ పోస్టులకు ఖాళీలు ఉన్నాయి. అభ్యర్థులు శ్రీకాకుళం జిల్లా వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి వివరాల కోసం డిసిహెచ్ఎస్ ఆఫీస్ నోటీసు బోర్డును కూడా సందర్శించవచ్చు. ఈ ఉద్యోగాలు ఒక సంవత్సరం కాల పరిమితికి మాత్రమే. రిజర్వేషన్లు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వర్తిస్తాయి. మరింత సమాచారం కోసం, అభ్యర్థులు శ్రీకాకుళం జిల్లా వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

## రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని యువకుడు మృతి

కశింకోట, మార్చి 9, మేజర్‌న్యూస్



మండలంలోని బయ్యవరం వద్ద గల చేప బంకు వద్ద శనివారం రాత్రి 12:30 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని యువకుడు మృతి చెందినట్లు కసింకోట ఎస్సై కే లక్ష్మణరావు తెలిపారు. మృతుడు 30 నుండి 35 వయసు కలిగి ఉన్నాడని చెప్పారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు కసింకోట పోలీసులకు సమాచారం అందివ్వాలని కోరారు. 9440796088, 7780620619 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## జడ్పీలో నేడు గ్రీవెన్స్ నిర్వహణ.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం, మార్చి 9, మేజర్‌న్యూస్



ఈనెల 10వ తేదీన సోమవారం శ్రీకాకుళం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుంచి నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## షిరిడి సాయి శాంతి ధామంలో ఘనంగా వారోత్సవాలు ప్రారంభం

గాజువాక, మార్చి 8, మేజర్‌న్యూస్





సమతా నగర్ షిరిడి సాయి శాంతి ధామంలో ఘనంగా ఏకాదశ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఆదివారం ఆలయ అర్చకులు శ్రీనివాసరావు, శాంతారావులచే బాబా వారికి ఉదయం 5 గంటలకు కాకడ హారతి, సామూహిక ధుని పూజ అనంతరం బాబా వారిని ప్రత్యేక అలంకరణ ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు భక్తులకు అందజేశారు. బాబా వారిని భక్తులు వేకువజాము నుంచి అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. సాయంత్రం సంగీత విభావరి, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులని, భక్తులను అలరించాయి. సంధ్య హారతి, వేదాశీర్వచనం, శేజ్ హారతి, ఊంజల సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు కొల్లి సత్యంబాబు, ఉపాధ్యక్షులు బి.రవి శేఖర్, కోశాధికారులు పి.సత్య నారాయణ, బి.రామకృష్ణ, మాజీ అధ్యక్షులు బి.లోకేందర్ రెడ్డి, నక్కా లక్ష్మణరావు, బండి శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు, పాల్గొన్నారు..

## సమాజ సేవకులు లగుడు గోవిందరావును వరించిన ఆరవ డాక్టరేట్

### డాక్టరేట్‌ను అందజేసిన న్యూఢిల్లీ సోక్రటీస్ సోషల్ రీసెర్చ్ యూనివర్సిటీ

### -వ్యక్తమవుతున్నహర్షాతిరేకాలు

కే కోటపాడు, మార్చి9, మేజర్‌న్యూస్

సామాజిక స్పృహతో గత 15ఏళ్ళుగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ విశేష గుర్తింపు పొందిన విశాఖ వాస్తవ్యులు రాష్ట్ర వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షులు లగుడు గోవిందరావును ఆరవ దఫా గౌరవ డాక్టరేట్ వరించింది. ఇప్పటికే ఐదు సార్లు డాక్టరేట్ అందుకున్న గోవిందరావుకు ఢిల్లీలోని సోక్రటీస్ సోషల్ రీసెర్చ్ యూనివర్సిటీ వారు తాజాగా ఆదివారం గౌరవ డాక్టరేట్ ను ప్రధానం చేశారు. ఈయన నిర్వహించిన రక్తదాన శిబిరాలు, మెడికల్ క్యాంపులు, కంటి వైద్య శిబిరాలు, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల శిబిరాలు, సామాజిక, కమ్యూనిటీ ఉద్యమాలు రాష్ట్ర, దేశ వ్యాప్తంగా అందించిన సేవలు బాగా ప్రాచుర్యం పొందిన నేపథ్యంలో ఢిల్లీ యూనివర్సిటీ వారు గుర్తించి ఆరవ గౌరవ డాక్టరేట్ ను ప్రధానం చేశారు. అలాగే ఇంటర్నేషనల్ రత్నశ్రీ 2025అవార్డును కూడా వారు అందజేశారు.ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేజీ బాలకృష్ణన్, యూనివర్సిటీ ఛైర్మన్ డాక్టర్ యోగేంద్ర కుమార్, అధిక సంఖ్యలో ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్లు పాల్గొన్నారని డాక్టరేట్ గ్రహీత లగుడు గోవిందరావు తెలిపారు.



## ఫేక్ బిల్లులు ఓవర్ లోడ్‌తో ఇసుక రవాణా.. చోద్యం చూస్తున్న అధికారులు

ఆనందపురం, మార్చి 9, మేజర్‌న్యూస్



ఫేక్ వేబిల్లులు, ఓవర్ లోడ్ తో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారన్న సమాచారంతో ఆదివారం ఉదయం క్వారీ లారీ ఓనర్స్ యూనియన్ ప్రతినిధుల సమాచారంతో 10 ఇసుక లారీలను వేములవలస పెట్రోల్ బంక్ సమీపంలో స్థానిక పోలీస్లు పట్టుకొని స్టేషన్కు తరలించారు. ఈ మేరకు లారీ ఓనర్స్ యూనియన్ ప్రతినిధులు ఆదివారం పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకొని అక్రమ రవాణా చేసిన లారీ యజమానులు యూనియన్ ప్రతినిధులు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా క్వారీ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మద్దిల వెంకటరమణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇసుక పాలసీ తీసుకొని వచ్చిన అనంతరం కొంతమంది ఫేక్ బిల్లులతో రోజుకు మూడు వరకు ఓవర్ లోడ్ తో ఇసుకను తీసుకొని వస్తున్నారని పేర్కొన్నారు . ముఖ్యంగా విజయవాడ ,గుంటూరు రాజమండ్రి తదితర చోట్ల నుండి వచ్చే లారీ యాజమాన్యులు అధికారుల పలుకుబడితో అక్రమంగా ఓవర్ లోడ్ సాగిస్తున్నారని పేర్కొన్నారు. శ్రీకాకుళం నుండి వస్తున్న లారీలను పలుచోట్ల ఓవర్ లోడు బిల్లులను పరిశీలించవలసిన అధికారులు తూతూ మంత్రంగా చర్యలు చేపట్టడంతో అక్రమంగా ఓవర్ లోడ్ ఇసుక రవాణా జరుగుతుందని పేర్కొన్నారు. సాధారణంగా ఓవర్ లోడుకు టన్ను కు రూ.2వేలు, ఓనర్‌కు రూ.20 వేలు చొప్పున విధిస్తున్నారు. నాయకులు పలుకుబడితో కొన్ని వాహనాలకు షరతులు వర్తించకపోవడంతో లారీ ఓనర్స్ పలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. లారీలలో ఇసుక రవాణా ఎలా చేస్తున్నారో యూనియన్ ప్రతినిధులకు అందరికీ తెలిసనీ కొన్ని వాహనాలకు పట్టించుకోకపోవడంతో పలు ఇబ్బందులు తలెత్తుతున అధికారులు ఫేక్ బిల్లులను ఓవర్ లోడ్లను అరికట్టి అందరికీ సమన్యాయం చేయాలని పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ ను సంప్రదించినట్లు తెలిపారు. ఓవర్ లోడు ఫేక్ వేబిల్లను వచ్చిన వాహనాలను యూనియన్ ప్రతినిధులు నిలదీస్తే మీరెవరు అంటూ ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్వారీ లారీ ఓనర్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ బొట్ట సురేష్, వైస్ ప్రెసిడెంట్ బొట్ట సురేష్ కుమార్, కొయ్య శ్రీను, కన్వీనర్ మద్దిల శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ ఆవాల రామకృష్ణ అనందపురం సింహాద్రి లారీ ఓనర్స్ యూనియన్ సెక్రటరీ కోరాడ శ్రీను, సభ్యులు నమ్మి మాధవరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**లారీ బిల్లులను పరిశీలించి మైనింగ్ రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకు వెళ్తాం.. సీఐ వాసు నాయుడు**

వేములవలస గ్రామం సమీపంలో లారీ యూనియన్ నాయకులు మధ్య వైరుధ్యం కారణంగా 10 లారీలను పోలీస్ స్టేషన్కు తీసుకువచ్చామన్నారు లారీలు ఇసుక బిల్లులను పరిశీలించి మైనింగ్ రెవెన్యూ అధికారులకు సమాచారం అందించి చర్యలు చేపడతామన్నారు.

## నూకంబికను దర్శించిన మంత్రి వాసంశెట్టి సుభాష్

అనకాపల్లి, మార్చి 9, మేజర్‌న్యూస్



ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి గవరపాలెం లో వెలిసిన శ్రీ నూకంబిక అమ్మవారి దేవస్థానంలో ఆదివారం రాష్ట్ర కార్మిక, పరిశ్రమలు శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అమ్మవారి దర్శించుకున్నారు. ముందుగా ఆలయానికి వచ్చిన ఆయనకు దేవాదాయ శాఖ ఉప కమిషనర్, ఆలయ ఈవో ఎన్ సుజాత ఆలయ మర్యాదలతో పూర్ణకుంభం తో స్వాగతం పలికారు. ఆలయములో ఆయనకు ప్రత్యేక పూజలు చేసి ఘనంగా సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు. ఆయన వెంట రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా 'సంక్రాంతికి వస్తున్నాం' 50 రోజులు వేడుకలు

అనకాపల్లి, మార్చి 9, మేజర్‌న్యూస్



సంక్రాంతికి వస్తున్నాం 50 రోజుల వేడుకలు అనకాపల్లిలో వైభవంగా ఆదివారం నిర్వహించారు. విక్టరీ వెంకటేష్ నటించిన సంక్రాంతి వస్తున్నాం చిత్రం ఈ సంక్రాంతికి విడుదలై అమోఘమైన విజయాన్ని సొంతం చేసుకొని అనేక రికార్డులను సాధించి విజయవంతంగా అనకాపల్లి శిరిడి సాయి థియేటర్లో 50 రోజులు ప్రదర్శన విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా అనకాపల్లి పట్టణ వెంకటేష్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో వేడుకలు వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వెంకటేష్ హెల్పింగ్ హాండ్స్ వ్యవస్థాపకులు పి.చందు మాట్లాడుతూ కేవలం 40 కోట్ల బడ్జెట్లో రూపొందించబడిన ఈ చిత్రం 300 కోట్లు పైచిలుకు వసూళ్లు రాబట్టి నిర్మాతకు 150 కోట్లు నికర లాభాన్ని అందించి విడుదలైన ప్రతి కేంద్రంలో కొత్త రికార్డులను సృష్టించి కలెక్షన్ లో సరికొత్త రికార్డులను సాధించి విక్టరీ వెంకటేష్ నట ప్రస్థానంలో నంబర్ వన్ స్థానాన్ని సాధించి రీజనల్ చిత్రాల్లో ఆల్ టైం ఇండస్ట్రీ రికార్డ్ సృష్టించినది అని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథి రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, థియేటర్ యాజమాన్యం వారికి, ఏజెంట్ సత్యనారాయణకి షీల్డ్స్ ప్రధానం చేశారు. అలాగే థియేటర్ మేనేజర్ ప్రసాద్ చేతుల మీదుగా విజయోత్సవ కేక్ కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా థియేటర్ సిబ్బందికి స్టీల్ క్యారేజీలు అందజేశారు. హెల్పింగ్ హాండ్స్ ద్వారా సమాజ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్న అభిమానులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, మళ్ల శ్రీను, జోగేంద్ర, రాజు తదితరులు ఈ చిత్రం సాధించిన విజయం అమోఘమైనదని ఇటువంటి చిత్రాలు తెలుగు సినిమా పరిశ్రమకు ఎంతో అవసరమని వెంకటేష్ అంటే అందరి హీరోల అభిమానులు తమ స్వంత హీరోగా అభిమానిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ వెంకటేష్ ఫ్యాన్స్ అధ్యక్ష, కార్యదర్శులు లాయర్ శీను, కొంగ నాగేశ్వరరావు, రోషన్, రాయి వెంకటరమణ, సోమేశు, పలివెల రాము, అర్జున్ పచ్చిపాల, దుప్పితూరు రాజు, వద్దాది గిరిబాబు, కాసా శీను, వెంకీ చిన్ని, జగన్, కిరణ్, నాగవరం శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున మందుగుండు కాల్చి పండుగ వాతావరణం నెలకొల్పారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ఆరిలోవ, మార్చి 9, మేజర్‌న్యూస్



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఇలా- చెన్నైలోని సబ్ ఆఫీస్, విశాఖపట్నంలో "ప్రతి స్త్రీని శక్తివంతం చేయండి, సమానత్వం, పురోగతి, చేరిక" అనే అంశంపై అసిస్టెంట్ డైరెక్టర్ ఇన్చార్జ్ సుధాంసు శేఖర్‌దాస్ ఇంటరాక్టివ్ సెషన్ ద్వారా జరుపుకున్నారు. అనంతరం కార్యాలయంలోని అన్ని సిబ్బంది ఫిట్ ఇండియా ప్రమాణం చేశారు. ఆన్లైన్ సెషన్ ద్వారా పోషకాహారం ద్వారా క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడం, యోగా సెషన్, ఆత్మరక్షణ శిక్షణ, మహిళా సిబ్బందికి బ్యాడ్మింటన్ ఏర్పాటు చేశారు.

## నూకాలమ్మ జాతర ఏర్పాట్లను పరిశీలించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి ప్రతినిధి, మార్చి 9, మేజర్‌న్యూస్



ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో ఉత్సవ ఏర్పాట్లను ఆదివారం మాజీ మంత్రి , శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పర్యవేక్షించారు ఈ సందర్భంగా ఆలయంలో కొణతాల అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పరిసరాలను పరిశీలించి రాష్ట్ర పండుగగా జరుగుతున్న సందర్భంగా ఈ సంవత్సరం ఉత్సవాలు భారీగా ఏర్పాటు చేయాలని అనకాపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా ఒక పండగ వాతావరణం లో అమ్మవారి జాతర జరిపించాలని స్థానిక అధికారులకు ఆదేశించారు. ముఖ్యంగా ట్రాఫిక్, ప్రధాన కూడలియందు భారీ ఆర్చీలు ఏర్పాటు చేయాలని, జాతరకు నెలరోజుల ఉత్సవానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు జరగాలని సూచించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు దేవాదాయ శాఖ ఉప కమిషనర్, ఆలయ ఈవో ఎన్ సుజాత స్వాగతం పలికి,ఆలయ మర్యాదలతో పూర్ణ కుంభం తో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి చిత్రపటాన్ని బహుకరించారు. అనంతరం జాతరకు జరుగుతున్న ఏర్పాట్లు అలాగే ఆలయ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ సీఎం రమేష్‌ను కలిసిన ఎమ్మెల్సీ గాదే

అనకాపల్లి ప్రతినిధి, మార్చి 9, మేజర్ న్యూస్



ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికైన గాదె శ్రీనివాసులు నాయుడు ఆదివారం అనకాపల్లి ఎం.పీ క్యాంపు కార్యాలయంలో రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సి.ఎం రమేష్‌తో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. అద్భుతమైన విజయం అందుకున్న గాదె శ్రీనివాసులు నాయుడుకి సి.ఎం రమేష్ దుశ్శలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు , ఉపధ్యాయ సంఘం ప్రతినిధులు గెలుపు కొరకు చేసిన కృషిని ఎంపీ సీఎం రమేష్ కి వివరించి ఎం.పీ సి.ఎం రమేష్‌ని సత్కరించి ప్రత్యేకంగా ధన్యవాదములు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఉపాధ్యాయులు, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన ఎంపీ సీఎం రమేష్

అనకాపల్లి ప్రతినిధి, మార్చి 9, మేజర్‌న్యూస్

స్థానిక ఎంపీ క్యాంపు కార్యాలయంలో జిల్లా ఇంచార్జ్ మంత్రి కొల్లు రవీంద్ర సమక్షంలో రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సి.ఎం రమేష్ చేతుల మీదగా జిల్లా కు చెందిన ముగ్గురు సభ్యులు వాలేటి ప్రసాద్, కాండ్రేగుల నాగ సత్యనారాయణ రాంబాబు,పెంటకోట లోకేష్ లకు సంబందించిన ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వచ్చిన చెక్కుల ను అందచేశారు. సిఎం రమేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని సి ఎం ఆర్ ఎఫ్ ద్వారా బాధిత కుంటుంబానికి సహాయం అందించి వారికీ చేయూత నివ్వడం కూటమి ప్రభుత్వానికే చెల్లిందని పేర్కొన్నారు. చెక్ అందజేసిన అనంతరం గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర ముఖ్యమంత్రి పంపించిన లేఖను చదివి వినిపించి పేదల వైద్యానికి పెద్దన్న వలె ఆదుకున్న ముఖ్యమంత్రికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఎంపీ సిఫార్సు లేక ద్వారా లక్షల రూపాయల లబ్ధి పొందిన బాధిత కుటుంబ సభ్యులు పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్‌కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.

## ఛత్తీస్గఢ్ గడ్ తెలుగు మహా సభలో 'తెప్పల'కు పురస్కారం

పలాస, మార్చి 9, మేజర్‌న్యూస్

ఛత్తీస్గఢ్ రాష్ట్రం రాయపూర్ గుడియారి మారుతీ మంగళ భవన్ లో మార్చి 8,9 తేదీలలో జరిగిన ఛత్తీస్గఢ్ తెలుగు ద్వితీయ మహా సభలకు పలాస కు చెందిన రచయిత,నటులు, స్థానిక జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ డా.తెప్పల కృష్ణ మూర్తి వివిధ కార్యకార్యక్రమాల్లో పాల్గొనడమే కాకుండా కవి సమ్మేళనం లో పాల్గొని 'స్వర్గం కన్న నా భారత్ మిన్న' అంటూ కవితాగానం చేసి ప్రశంసలు పొందారు.ఈ సందర్భముగా ఛత్తీస్గఢ్ తెలుగు మహా సంఘం సంరక్షకులు జి.స్వామి ఉపాధ్యక్షులు బర్రి జోగారావు,ఖరగ్ పూర్ తెలుగు సంఘం ప్రధాన కార్యదర్శి సురేంద్ర రెడ్డి,ప్రముఖ కవి సిరికి స్వామి నాయుడు తదితరులు చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారుఈ సందర్భంగా కృష్ణ మూర్తి కి వివిధ సంఘాలు సభ్యులు అభినందనలు తెలిపారు.

## ఫార్మాసిటీ కాలనీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్‌గా గోవింద్

పరవాడ, మార్చి 9, మేజర్‌న్యూస్

మండలంలో గల ఈ.బోనంగి ఫార్మసిటీ కాలనీ కొండపైన వున్న భూ సమేత అభయ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ నూతన కమిటీ ఎన్నికను ఆదివారం నిర్వహించారు. 2025-2028 సంవత్సరాలకుగాను అధ్యక్షులుగా బుగిడి రామ గోవిందరావు , కార్యదర్శిగా లాలం అప్పలనాయుడు , కోశాధికారిగా పత్సమట్ల లోవరాజు , కమిటీ సభ్యులుగా గొర్లి కనకారావు, మేడిశెట్టి బాలాజీ నాయుడు, సిహెచ్ సత్యనారాయణ, శ్రీ రేలంగి ధనరాజు, యం వి జి. రామశేఖర్, బొడ్డు అమరావతి, సాలాపు కేదారి కనక సంతోషి (దీపిక) ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులను వెంకటేశ్వర స్వామి గుడికి వచ్చే భక్తులు అభినందిస్తూ ఆలయం అభివృద్ధికి పాలక మండల సభ్యులు కృషి చేయాలని వారిని కోరారు.

## భరణికం గ్రామంలో విషాదం

### ప్రమాదవశాత్తు పెద్దచెరువులో పడి యువకుడు గల్లంతు

పరవాడ, మార్చి 9, మేజర్‌న్యూస్

మండలంలో గల అరటిపం గ్రామంలో ప్రమాదవశాస్తూ పెద్ద చెరువులో పడి ఒక యువకుడు గల్లంతైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది గ్రామానికి చెందిన యువకుడు బలిరెడ్డి సూర్య లక్ష్మి నారాయణరావు (35) చెరువులో మునిగిపోయినట్టు గ్రామానికి చెందిన కొందరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు.ఈ ప్రమాదంకు గల వివరాలు తెలియాల్సి ఉంది.ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్న పరవాడ పోలీసు బృందం.

## కోడిపందాల శిబిరంపై పోలీసుల దాడులు

పరవాడ, మార్చి 9, మేజర్‌న్యూస్:

జీవీఎంసీ పరిధిలోగల తాడి గ్రామం లో కోడిపందెం రాయుళ్లు పై పోలీసులు దాడులు చేసి కోడిపందాలు నిర్వహిస్తున్న 4 వ్యక్తులను అదుపులోడికి తీసుకొని కేసు నమోదు చేశారు. అదుపులోకి తీసుకున్న వారి నుండి 3 కోళ్లు 5800 రూపాయలు సీజ్ చేశామనిపరవాడ సీఐ ఆర్ మల్లికార్జున రావు తెలిపారు. సి ఐ ఆధ్వర్యంలో జరిగిన దాడిలో ఎస్సై బి. కృష్ణారావు, ఏఎస్ఐ బివై నాయుడు, హెడ్ కానిస్టేబుల్ సాయికుమార్, పీసీ జి.సన్యాసినాయుడు పాల్గొన్నారు.

## మహిళలు ఎప్పుడూ మహారాణులే

### మేనిఫెస్టోలో కూడా మహిళలకు తొలి ప్రాధాన్యత - పురుషుల కంటే మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు - మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి -కేజీహెచ్‌లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

విశాఖపట్నం, మార్చి 9, మేజర్ న్యూస్

సమాజంలో మహిళలు ఎప్పుడూ మహారాణులు గానే నిలుస్తారని రాష్ట్ర హెూం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు.ఆదివారం ఏపీ గవర్నమెంట్ నర్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్ర మెడికల్ కళాశాల సమావేశ మందిరంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాని హెూం మంత్రి అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రి అనిత మాట్లాడుతూ మహిళలు ఎప్పుడు మహా రాణులుగా నిలుస్తారన్నారు. కన్న తల్లిదండ్రులు కూడా పిల్లలను చూసుకోలేని ఈ పరిస్థితుల్లో వృత్తి బాధ్యతగా ఆసుపత్రికి వచ్చిన రోగులను అమ్మలా, కంటికి రెప్పగా చూసుకునే గొప్ప మహెూన్నత వ్యక్తులు నర్సింగ్ సిబ్బందని వారి సేవలను కొనియాడారు. వారు అమ్మలా అందించే సేవలు రోగికి ఎంతో మేలు చేకూరుతాయన్నారు. మహిళల లేకపోతే సమాజంలో పురుషుల పాత్ర ఏమాత్రం లేదని, ఆమె సేవలను ఒక్కరోజు మాత్రమే కాకుండా నిరంతరం గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. యంత్రంలా పనిచేస్తూ ఎటువంటి జీతాన్ని ఆశించకుండా తల్లిలా పని చేస్తుందని మహిళల సేవలను ప్రశంసించారు. గతంలో మహిళల సాధికారత, ఓటు హక్కుల కోసం కూడా పోరాటాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. నేడు దేశ,రాష్ట్ర జనాభాలో పురుషుల కంటే మహిళలే అధిక సంఖ్యలో ఉన్నారని అన్నారు. నేడు ప్రభుత్వాలు కూడా మేనిఫెస్టోలు తయారు చేసే సమయంలో మహిళలకు తొలి ప్రాధాన్యత ఇచ్చే అంశాలను పొందుపరుస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి తల్లిదండ్రి పిల్లలను బాధ్యతగా, భద్రతగా పెంచాలన్నారు. ఓవైపు ఇంటిని,మరోవైపు ఉద్యోగ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న మహిళలను చూసి నేటి తరంలో ప్రతి ఒక్కరు నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని కోరారు. తమ తమ వృత్తుల్లో మహిళలు ధైర్యంగా ఉండాలన్నారు. నర్సింగ్ అసోసియేషన్ సంబంధించిన వివిధ అంశాలపై సీఎం చంద్రబాబుతో మాట్లాడి వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రిలోని ప్రతి వార్డ్లో కూడా సీసీ కెమెరాలు ఉండేలా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆస్పత్రి ఉన్నతాధికారులను ఆదేశించారు. మహిళలకు పూర్తిస్థాయిలో భద్రత కల్పించే విషయంపై రాష్ట్ర ప్రభుత్వం శక్తి యాప్ ప్రవేశపెట్టిందని, దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ప్రభుత్వ శాఖలో కూడా మహిళల రక్షణకై అంతర్గత కమిటీలు నియమించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మహిళా దినోత్సవం పురస్కరించుకొని అసోసియేషన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా పలు ఆసుపత్రిలకు చెందిన రోగులకు ఉత్తమ సేవల అందజేసిన హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులను హెూం మంత్రి చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు.



## ఎమ్మెల్యే గంటా దృష్టికి ఆధారంలేని కుటుంబం

భీమునిపట్నం, మార్చి 9, మేజర్‌న్యూస్



భీమునిపట్నం మండలం, బోడమెట్ట పాలెం వద్ద కారు ప్రమాదానికి గురై చనిపోయిన పిట్ట నర్సింగ్ (35) కుటుంబాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లిన పార్లమెంటరీ సెక్రటరీ పిట్ట సురేష్. చిట్టివలస జూట్ మిల్ క్వార్టర్స్ లో నివాసం వుండే నర్సింగ్ డిసెంబర్ 9వ తారీఖున పెయింటింగ్ పనికి వెళ్తూ మార్గమధ్యంలో ప్రమాదానికి గురై చనిపోయినాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతని సంపాదన మీదే ఆ కుటుంబ పోషణ ఆధారపడి ఉంది. నర్సింగ్ కు తల్లిదండ్రులు చనిపోయారు. ఎటువంటి ఆస్తి గానీ , ఇతర ఆదాయం గానీ లేక ఆ కుటుంబం రోడ్డున పడింది.. వారి కుటుంబం తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి పార్టీతోనే నడుస్తుంది. ఆ కుటుంబ పోషణ నిమిత్తం నర్సింగ్ భార్యకు చిరు ఉద్యోగం, పిల్లలు చదువుకు తగు సహాయం అందించమని కోరగా, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో పిట్ట సురేష్‌తో జీవీఎంసీ 1వ వార్డు ప్రెసిడెంట్ తమ్మిన సూరిబాబు, మాదాబత్తుల వరలక్ష్మి, పిట్ట రామారావు, కొప్పల కృష్ణ పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతంలో ఆంగ్ల విద్య .. న్యూ లైఫ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల

ఆనందపురం, మార్చి 9, మేజర్‌న్యూస్




గ్రామీణ ప్రాంతంలో ఆంగ్ల విద్యను అందిస్తున్న న్యూ లైఫ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఈ ప్రాంత ప్రజల అదృష్టమని తెలుగుదేశం పార్టీ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, భీమిలి నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి కోరాడ రాజబాబు పేర్కొన్నారు. మండలంలోని గోట్టుపల్లి న్యూ లైఫ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 19వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పాఠశాలను స్థాపించి 19 ఏళు సుదీర్ఘంగా విద్యా బోధన అందించిన పాఠశాలను అభినందించారు నేడు ఇంగ్లీష్ భాష ఎంతో అవసరం అన్నారు ప్రస్తుతం ఉద్యోగ అవకాశాలు ఇంగ్లీష్ ఆధారంగానే ఎక్కువగా ఉంటాయన్నారు మాతృభాష మర్చిపోకూడదని మాతృభాషతో పాటు ఇంగ్లీష్ పై పట్టు సాధించాలన్నారు తల్లిదండ్రులు విద్యార్థులను అశ్రద్ధ చేయరాదన్నారు. పాఠశాలలకు పంపడంలోని తమ పని పూర్తి కాదని విద్యార్థులు ప్రవర్తన పై శ్రద్ధ వహించాలన్నారు. ఆనందపురం సిఐ చింత వాసు నాయుడు మాట్లాడుతూ తల్లిదండ్రులు విద్యార్థుల ప్రవర్తన పై శ్రద్ధ వహించాలన్నారు ముఖ్యంగా ఎలా చదువుతున్నారే కాకుండా ఇటువంటి ప్రవర్తన కలిగి ఉన్నారని గమనించాలన్నారు. సెల్ఫోన్లకు దూరంగా ఉంచాలన్నారు విద్య తో పాటు మంచి ప్రవర్తన వచ్చే విధంగా తయారు చేయాలన్నారు ప్రాథమిక విద్య ఎంతో కీలకమని ఈ దశలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతి కార్యక్రమాలు చూపర్లను ఆకట్టుకున్నాయి పల్లెలకు ప్రాధాన్యతీస్తూ చేసిన నాటకం ఆకట్టుకున్నాయి తండ్రి పాత్ర గురించి వేసిన వేషధారణ కార్యక్రమం ఆకట్టుకున్నది ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షులు జంగం జోషి గోట్టిపల్లి సర్పంచ్ జగదీష్ పాల్గొన్నారు.

## పలాస నియోజకవర్గ సమస్యలపై దృష్టి సారించాలి

### తెదేపా పలాస నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి

పలాస, మార్చి 9, మేజర్‌న్యూస్




పలాస నియోజకవర్గ సమస్యలపై ముఖ్య నాయకులు దృష్టి సారించాలని తెదేపా పలాస నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి కోరారు. పలాసలో గల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా వెంకన్న చౌదరి మాట్లాడుతూ అభివృద్దే ధ్యేయంగా పనిచేయాలని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంవత్సర కాలంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు.పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో అభివృద్దే ధ్యేయంగా నిరంతరం పని చేస్తున్నామని,అలాగే నియోజకవర్గంలో ప్రతి గ్రామం అభివృద్ధి పథం లో నడవాలనే ధ్యేయంగా పనిచేయాలని పలాస ముఖ్య నాయకులు తో సమావేశం ఏర్పాటు చేసి దశదిశ నిర్దేశం చేశారు.నియోజకవర్గప్రధాన సమస్య లు పై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని వెంకన్న చౌదరి సూచించారు.పలాస కాశీబుగ్గలో రైల్వే ఫ్లైఓవర్ వంతెన ఊహించని విధంగా కేంద్ర ప్రభుత్వం రూ.49 కోట్లకు పైగా నిధులు ఇచ్చిందని, తొందరలోనే పనులు జరుగుతాయన్నారు. కాశీబుగ్గ-అక్కుపల్లి-బెండి రహదారులకు తొందరలోనే మోక్షం లభించనుందని,రానున్న రోజుల్లో ప్రతి గ్రామానికి అంతర్గత రహదారులు, పెండింగ్లో ఉన్న పనులు నిర్వహించడం జరుగుతుందన్నారు.జిల్లాకు అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు మంజూరయిందని,పలాస జిల్లా కేంద్రం కూడా ఏర్పాటుకు మార్గం సుగమం అయిందన్నారు.2027 నాటికి మొత్తం అభివృద్ధి పనులు పూర్తయ్యే విధంగా ప్రణాళికాబద్ధంగా వెళ్తున్నామన్నారు.ఆఫ్ షోర్ రిజర్వాయర్ కు కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రూ.30కోట్లు, ప్రస్తుత బడ్జెట్లో రూ.90 కోట్లు రికార్డుస్థాయిలో మంజూరయ్యాయని,పనులు వేగవంతం చేయడానికి అధికారులతో ఇప్పటికే చర్చించడం జరిగిందని,ఆఫ్ షోర్ పూర్తయితే రెండు పంటలకు సరిపడా సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. కాశీబుగ్గలో కేంద్రీయ విశ్వవిద్యాలయం కు త్వరలోనే బీజం పడనుందని,నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం,జీడి పరిశోధన కేంద్రాల నిర్మాణం ప్రతిపాదనలో ఉందని స్పష్టం చేసారు.ప్రతి చేతికి పని,ప్రతి చేనుకు నీరు సంకల్పంతో ఎమ్మెల్యే గౌతు శిరీష అభివృద్ధి దిశగా వెళ్తున్నారని,ఆమెకు కార్యకర్తలు,నాయకులు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు.భవిష్యత్తులో పలాస రోల్ మోడల్ నియోజకవర్గంగా మార్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు,పీరికట్ల విఠల్ రావు, లొడగల కామేశ్వరరావుయాదవ్,గాలి కృష్ణారావు,గురిటి సూర్యనారాయణ,దువ్వాడ శ్రీకాంత్, ఎం.నరేంద్ర (చిన్ని), మల్లా శ్రీనివాస్, శాసనపురి మురళీకృష్ణ,బడ్డ నాగరాజు,సప్ప నవీన్, ఎ.రామకృష్ణ,టంకాల రవిశంకర్ గుప్తా,జోగ మల్లి. కొత్త సత్యంతో పాటు పలాస,వజ్రపుకొత్తూరు, మందస మండలాలకు చెందిన టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## విశ్వశాంతి హైస్కూల్‌లో 10వ తరగతి వీడ్కోలు సందడి..

పోలాకి, మార్చి 9, మేజర్‌న్యూస్



విశ్వశాంతి హై స్కూల్ నందు 10వ తరగతి విద్యార్థుల ఫేర్వెల్ ఫంక్షన్ ఆదివారం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమమునకు అధ్యక్షులుగా మెట్ట జనార్దన్ రావు, మెట్ట కొండమ్మ వ్యవహరించడం జరిగింది. తదనాంతరం విద్యార్థులను ఉద్దేశించి మా పాఠశాల కరస్పాండెంట్ మెట్ట జనార్దనరావు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గెద్దవలస చంద్రరావు, ఐఐటి ఫౌండేషన్ ఇంచార్జ్ మెండ అప్పల నాయుడు, ఉపాధ్యాయ సిబ్బంది తమ అమూల్య సందేశాలను అందించారు. మా ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన మా పూర్వ విద్యార్థులు డాక్టర్ పైల రమణ ప్రముఖ న్యూరాలజిస్ట్ ఊట 10వ తరగతి 2002-2003 డా.కిల్లి సతీష్ కుమార్, ప్రముఖ కార్డియాలజిస్ట్ 10వ తరగతి 2002-2003 విచ్చేసి, విద్యార్థులను ఉద్దేశించి తమ పాఠశాల పూర్వ అనుభవాలను, పలు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని పలు సాంస్కృతిక కార్యక్రమములు నిర్వహించడం జరిగింది.

## గురుకుల పాఠశాలలో ఫోక్సో యాక్ట్ చట్టంపై బాలికలకు అవగాహన

పరవాడ, మార్చి 9, మేజర్‌న్యూస్




ఫోక్సో చట్టంపై బాలికలకు పూర్తి అవగాహన కలిగి ఉండాలని అనకాపల్లి అడిషనల్ జిల్లా జడ్జ్ శ్రీవిద్య అన్నారు. ఆదివారం రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు ఆదేశాలనుసారం పోక్సో యాక్ట్ అవగాహన సదస్సును మహాత్మ జ్యోతిబా పూలే వెనకబడిన తరగతుల పాఠశాల, జూనియర్ కళాశాల తానంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఎమ్ ఎల్ ఎ జిల్లా అడిషనల్ జడ్జి ఎన్ శ్రీవిద్య, ప్రిన్సిపాల్ సుహాసిని, జి రేష్మ పలవి వైస్ ప్రిన్సపాల్ మరియు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్ మల్లికార్జున రావులు విద్యార్థులకు ఫోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. నేటి సమాజ పరిస్థితుల ను బాలికలు మెలగాల్సిన తీరుపై వారికి ఈ కార్యక్రమంలో పరవాడ పోలీస్ స్టేషన్ మరియు ఇతర సిబ్బంది విద్యార్థునులు తదితరులు పాల్గొన్నారు.

## 34వ వార్డు గ్రామ పండగకు వాసుపల్లి ఆర్థిక సాయం

విశాఖపట్నం, మార్చి 9, మేజర్ న్యూస్



దక్షిణంలో పండగ అయినా కార్యమైన ముందుగా గుర్తొచ్చేది వాసుపల్లి గణేష్ కుమార్ సేవా కార్యక్రమాలు. దీనిలో భాగంగానే జీవీఎంసీ 34వ వార్డులో గ్రామ పండుగకు మాజీ ఎమ్మెల్యే, దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. ఆసీలమెట్ట కార్యాలయంలో 34వ వార్డు వైఎస్ఆర్సిపి నేతల ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులకు రూ. 5వేలు నగదును స్వయంగా వాసుపల్లి గణేష్ కుమార్ అందజేశారు. ప్రజల కష్టమేనా, నేతల అవసరమైన సమస్యలకైనా సొంత నిధులతో చేయూతనందిస్తున్నారు. అధికారంలో లేకున్నా తన ప్రజలకు అండగా వాసుపల్లి గణేష్ కుమార్ సేవా కార్యక్రమాలు నిర్విరామంగా కొనసాగిస్తున్నారు. జగనన్న ఆశయాలతో మదర్ తెరిసా రోల్ మోడల్‌గా అంబేద్కర్ అడుగుజాడల్లో తన జీవితాంతం ప్రజా సేవలోనే ఉంటానని వాసుపల్లి గణేష్ కుమార్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి విశాఖ జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి రామానంద్, జిల్లా కార్యదర్శి ఆది విష్ణు రెడ్డి, సౌత్ క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షులు సువార్త రాజు, ఎర్రినమ్మ తల్లి గుడి చైర్మన్ లండ రమణ, 35వ వార్డ్ అధ్యక్షులు అలుపన కనకా రెడ్డి, లింగం శ్రీను, అరుగుల రాజు, బోర శ్రీనివాస్ రెడ్డి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళ ప్రజా ప్రతినిధులను పాలనలో భాగస్వాములు చేయండి

### ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ రాజు



రావికమతం, మార్చి 9, మేజర్ న్యూస్

ఈ మహిళా దినోత్సవం నుంచి అయినా మహిళ ప్రజా ప్రతినిధులను పరిపాలనలో భాగస్వాములను చేయాలని ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ రాజు పిలుపునిచ్చారు. వెలుగు కార్యాలయంలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మహిళలు పరిపాలనలో భాగస్వాములు చేయాలని ఉద్దేశంతో వార్డు మెంబర్ నుంచి ఎమ్మెల్యేల వరకు మహిళా రిజర్వేషన్ నిర్ణయించిన విషయం తెలిసిందేనన్నారు . దీనిలో భాగంగా గ్రామస్థాయి నుంచి మహిళలు వివిధ స్థాయిలో ప్రజా ప్రతినిధులుగా ఎన్నికల రణరంగంలో విజేతలుగా మారుతున్నారన్నారు . అయినప్పటికీ పరిపాలన వారి భర్తలే నిర్వహిస్తున్నారని జగమెరిగిన సత్యం అన్నారు.ఇ మహిళా దినోత్సవం నుంచి మహిళ ప్రజా ప్రతినిధులును స్వేచ్ఛగా పరిపాలన చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. మహిళలు ఆర్థిక స్వాలంబనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూర దృష్టితో డ్వాక్రా సంఘాలును ఏర్పాటుచేసి వీటికి నామమాత్రపు వడ్డీతో రుణాలు మంజూరుకు బ్యాంకులో ఒప్పించిన విషయం తెలిసిందన్నారు. డ్వాక్రా సంఘాలు తీసుకున్న రుణాలతో కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయాల్సివుండగా దీనికి విరుద్ధంగా కుటుంబ ఖర్చులకు బ్యాంకు రుణాల మొత్తం ఖర్చు చేయడం ఇకనైనా మానుకోవాలని తెలిపారు దీనికోసం వెలుగు సిబ్బంది కఠిన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మండలంలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం ఈశ్వరరావు, ఎండిఓ వెంకన్న బాబు, సూపర్డెంట్ స్వామి, రావికమతం సర్పంచ్ మంగ, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు కొండనాయుడు తదితరులు పాల్గొన్నారు

## మహిళలు అన్ని రంగాలలో ముందుండాలి : డిఎల్టిఓ డా.పూర్ణేంద్రబాబు



గాజువాక, మార్చి 9, మేజర్‌న్యూస్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎక్సెప్ట్ సిసి కార్యాలయంలో మహిళ దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎయిడ్స్, లెప్రసీ అధికారి డాక్టర్ పూర్ణేంద్ర బాబు, న్యాయవాది రేవతి,ఎక్సెప్ట్ సీసీ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.అనిల్ కుమర్, ప్రాజెక్ట్ మేనెజర్ పి.కిరణ్ కుమార్ పాల్గొన్నారు.ఆఫీసు సిబ్బందితో కలిసి మహిళ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న డిఎల్టిఓ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందు వుండాలని, సామాజిక చైతన్య స్ఫూర్తితో నేటి మహిళ అభివృద్ధి పథంలో పయనిస్తుందని, అన్ని రంగాలలో మహిళలు రాణించడం హర్షించదగ్గ విషయమని అన్నారు.

## క్రమశిక్షణతో మెలగాలి

### - పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించండి - ప్రముఖ సామాజికవేత్త డా.సూర శ్రీనివాసరావు - పదోతరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ



శ్రీకాకుళం, మార్చి 9, మేజర్‌న్యూస్

పదోతరగతి పరీక్షలకు ఈ నెల 15న హాజరయ్యే విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి మంచిగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రముఖ సామాజిక, వ్యాపార వేత్త డాక్టర్ సూర శ్రీనివాసరావు అన్నారు. ఎచ్చెర్ల లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష అట్టలతో పాటు పరీక్ష సామగ్రిని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవితకు పదో తరగతి పునాది వంటిదన్నారు. ఇక్కడ ఉత్తమ మార్కులతో ప్రతిభ చాటితే ఉన్నత చదువులకు బాటలు వేసుకోవచ్చునని సూచించారు. మంచి మార్కులతో ఉత్తమ లక్ష్యాలను సాధించి మీమీ తల్లిదండ్రులకు, పాఠశాలలకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, పెన్సిల్స్, షార్ప్ నర్స్, ఎరైజర్స్, స్కేల్స్, హాల్‌టికెట్ పౌచ్‌లు పిల్లలకు అందించారు. ప్రతీ ఏటా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేయడం ఆనవాయితీగా వస్తోందని, అదే మాదిరిగా ఈ ఏడాది కూడా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందజేస్తామని వివరించారు. సూర శ్రీనివాసరావు చేస్తున్న సేవ పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలుపుతున్నారు.

## శ్రీ దుర్గాలమ్మ ఆలయంలో మహా అన్నదానం



విశాఖపట్నం, మార్చి 10, మేజర్‌న్యూస్

పూర్ణా మార్కెట్ సమీపంలోని శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి దేవస్థానంలో జరిగిన వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం 5000 మంది భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీ కృష్ణ శ్రీనివాస్,దక్షిణ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి రాష్ట్ర ఎన్టీఆర్ వైద్య సేవ చైర్మన్ సీతంరాజు సుధాకర్ అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమలో 35 వ వార్డు కార్పొరేటర్ వి. భాస్కరరావు వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బుచ్చ రామిరెడ్డి జనసేన నాయకులు పిల్లి రమణ, లెంకా త్రినాథ్, బిజెపి నాయకులు చిన్న, అన్నదాన దాతలు భాస్కర్ ప్లాస్టిక్స్ అధినేత రంగనాథ్,మాత ప్యాకేజింగ్స్ అధినేత మోతుకూరి శ్రీనివాసరావు, శర్వాణి ఫుట్ వేర్ అధినేత ఎర్రా త్రినాథ్, ఆలయ. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పైల శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్ వన్ నుంచి ఎంపిడివో పోస్టులు రద్దుపై నిరుద్యోగులు ఆందోళన

### ఏపీ నిరుద్యోగుల సంఘం ఐక్యవేదిక ఆధ్వర్యంలో త్వరలో ఆందోళనలకు సిద్ధం

విశాఖపట్నం, మార్చి 9, మేజర్‌న్యూస్

పంచాయతీరాజ్ శాఖలో ఎంపీడీవో పోస్టుల రద్దు పై ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగుల ఐక్యవేదిక సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రూప్ వన్ లో ఉన్న సుమారు 250 ఎంపీడీవో పోస్టులను డైరెక్ట్ రిక్రూట్మెంట్ నుండి అక్రమంగా రద్దు చేయడం పట్ల ఆంధ్రప్రదేశ్లో నిరుద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ ఐక్యవేదిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొలుసు శ్రీనివాసరావు ప్రభుత్వం తీరు పై మండిపడుతున్నారు.ఈ మేరకు ఆదివారం ఒక పత్రిక ప్రకటనలో ఎంపీడీవో పోస్టులు రద్దు పై తాము భవిష్యత్తులో చేయబోయే ఆందోళనలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. గత వైసిపి పెద్దలు చెప్పినట్లు ఆడిన రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి ఆశీస్సులతో గత వైసిపి ప్రభుత్వం హయాంలో నవరత్నాలు అమలు కోసం 77 డివిజనల్ డెవలప్మెంట్ పోస్టులు మంజూరు చేసి ఆ ప్రభుత్వ స్వలాభానికి సహకరించిన డి ఎల్ డి ఓ లకు కూటమి ప్రభుత్వంలో కూడా పంచాయతీరాజ్ శాఖలో ప్రాధాన్యత ఇవ్వడం ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి సిగ్గుచేటని ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగుల ఐక్యవేదిక అంటున్నది. గ్రూప్ వన్ పోస్టుల్లో చిట్టచివరగా ఉన్న మండల పరిషత్ డెవలప్మెంట్ ఆఫీసర్స్ పోస్టులను ఏకపక్షంగా రద్దుచేసి నిరుద్యోగుల ఆశలు అడియాసలు చేసిందని , కూటమి ప్రభుత్వానికి ,పంచాయతీరాజ్ శాఖ మంత్రి కి ,తప్పుడు వివరాలతో నాకు నచ్చినట్టు పంచాయతీరాజ్ శాఖ ఉపయోగించు ఉపయోగించుకోవడానికి కొందరు డి ఎల్ డి వో లు చేస్తున్న అరాచకాలకు పంచాయతీ వ్యవస్థ కుప్పకూలే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖలో సంస్కరణల పేరుతో 250 ఎంపీడీవో పోస్టులను గ్రూప్1నుండి తప్పించడం పెద్ద పొరపాటని అన్నారు. గ్రూప్ వన్ లో డిఎల్డివో పోస్టులను చేరుస్తున్నట్లు కూటమి ప్రభుత్వం ప్రకటించిందని అయితే ప్రస్తుతం ఉన్న డి ఎల్ డి వో లు తన స్వలాభం కోసం ఈ పోస్టుల్లోకి రావడంతో ఇప్పట్లో ఈ పోస్టులు ఖాళీయే పరిస్థితి లేదని అంటున్నారు.ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా గ్రూప్ వన్ పరీక్షకు హాజరయ్యే నిరుద్యోగులకు ఎంపీడీవో పోస్టులు రద్దుతో ఉన్న పోస్టులకు కాస్త తగ్గిపోయాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి గ్రూప్ వన్ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ఇటీవల మెగా డీఎస్సీ ప్రకటనతో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జోష్ పుట్టించారు .అయితే సంస్కరణల పేరిట ఎంపీడీవో కాళీలను బ్లాక్ చేస్తున్న సమాచారంతో నిరుద్యోగులు డీలపడ్డారని అన్నారు. కొంతమంది డీఎల్డీవో పోస్టుల్లో ఉన్న అధికారులు, మరి కొంతమంది పంచాయతీరాజ్ కమిషనర్ ఆఫీస్ అధికారులు తప్పుదోవ పట్టించి ఎటువంటి క్యాబినెట్ సబ్ కమిటీ ప్రసక్తి లేకుండా ,ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అనుమతి లేకుండా నిరుద్యోగ సంఘాలతో సంప్రదింపులు లేకుండా గ్రూప్ 1 సర్వీసులు నుండి ఎంపీడీవో పోస్టులను తొలగించడానికి కుట్ర చేసి చట్టంగా మార్చే పరిస్థితి తీసుకురావడం పంచాయతీరాజ్ శాఖ అధికారుల కే సిగ్గుచేటని ఈ సందర్భంగా వారు అభిప్రాయపడ్డారు .త్వరలోనే రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య నేతృత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి పంచాయతీరాజ్ శాఖలో జరుగుతున్న అన్యాయాలపై పూర్తిస్థాయిలో వివరాలు అందిస్తామని ప్రకటించారు. ఇప్పటికే రాష్ట్రంలో గ్రామపంచాయతీ వ్యవస్థ లో డిఎల్డిఏవోలను డిపిఓలుగా నియమించడంతో వారిలో కొందరు పనితీరు సరిగా లేక ప్రభుత్వ నిర్వహిస్తున్న ఐవి ఆర్ఎస్ సర్వేలో ప్రజల నుండి అనేక సమస్యలు బయటపడడంతో పంచాయతీరాజ్ వ్యవస్థ పనితీరు భ్రష్టపట్టిపోయిందని ప్రస్తుత సర్వేలో చెబుతున్నాయని ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి ఎంపీడీవో పోస్టులను గ్రూప్ అండ్ లో చేర్చాలని ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగుల ఐక్యవేదిక అధ్యక్షులు శ్రీనివాసరావు ,కార్యదర్శి శిష్ట రోహిత్ , ఉపాధ్యక్షులు వెలుగుల గాయత్రి తదితరులు కోరుతున్నారు.

## సల్ఫర్ తయారీ కేంద్రాన్ని ప్రారంభించిన కోరమాండల్ ఇంటర్నేషనల్

విశాఖపట్నం, మార్చి 10, మేజర్‌న్యూస్

భారతదేశంలోని వ్యవసాయ పరిష్కార ప్రదాతలలో ఒకటైన కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో ఉన్న తమ కేంద్రంలో రెండవ సల్ఫర్ తయారీ కర్మాగారాన్ని ప్రారంభించింది. విశాఖపట్నం సైట్ కంపెనీ యొక్క పూర్తి బ్యాక్ వార్డ్ ఇంటిగ్రేటెడ్ యూనిట్, ఫాస్ఫారిక్ ఆమ్లం, సల్ఫ్యూరిక్ ఆమ్లంతో పాటు సుమారు 12 ఎల్ఎంటి కాంప్లెక్స్ ఎరువులను ఉత్పత్తి చేస్తుంది. ఈ సైట్ 25000 ఎం టీ ఉత్పత్తి సామర్థ్యంతో సల్ఫర్ ఎరువుల కర్మాగారాన్ని కూడా కలిగి ఉంది. ఈ కొత్త ప్లాంట్ ప్రారంభంతో, కంపెనీ సల్ఫర్ ఎరువుల సామర్థ్యం రెట్టింపు అవుతుంది, ఇది రైతులకు అధిక-నాణ్యత గల బెంటోనైట్ సల్ఫర్ ఎరువుల స్థిరమైన సరఫరాను నిర్ధారిస్తుంది. ఈ విస్తరణ స్పెషాలిటీ న్యూట్రియంట్స్ మార్కెట్‌లో కోరమాండల్ కార్యకలాపాలను విస్తృతం చేయడంతో పాటుగా భారతీయ వ్యవసాయం పట్ల దాని నిబద్ధతను పునరుద్ఘాటించటంలో ఒక ముఖ్యమైన ముందడుగును సూచిస్తుంది. ఈ కార్యక్రమానికి కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఎండి ఎస్ శంకరసుబ్రహ్మణ్యన్, స్పెషాలిటీ న్యూట్రియంట్, ఆర్గానిక్ ఫెర్టిలైజర్స్ బిజినెస్ హెడ్ అవినాష్ ఠాకూర్ ఇతర సీనియర్ బృంద సభ్యులు హాజరయ్యారు. మొక్కల పెరుగుదలకు అవసరమైన పోషకం, సల్ఫర్. ప్రోటీన్ సింథసిస్, ఎంజైమ్ పనితీరు, మొత్తం పంట ఉత్పాదకతలో కీలక పాత్ర పోషిస్తుంది. భారతదేశంలో, అధిక స్థాయిలో పంటలు వేయడం, సరైన పద్ధతులలో ఎరువులను వాడక పోవటం, నేలలో తగ్గుతున్న సేంద్రియ పదార్థాల వంటి కారణాల వల్ల సల్ఫర్ లోపం పెరుగుతున్న ఆందోళనగా ఉంది. తమ బెంటోనైట్ సల్ఫర్ సామర్థ్యాన్ని పెంచడం ద్వారా, కోరమాండల్ భారతీయ రైతుల కోసం భూసారాన్ని మెరుగుపరచడానికి మరియు దిగుబడిని పెంచడానికి అధిక-నాణ్యత, సరసమైన, స్థిరమైన పోషక పరిష్కారాలను అందించడం లక్ష్యంగా పెట్టుకుందని ఈ సందర్భంగా వారు తెలిపారు.

## గ్రంధాలయంలో చదవడం మా కిష్టం

తెర్లాం, మార్చి 9, మేజర్ న్యూస్

స్థానిక గ్రంధాలయం లో చదవడం మా కిష్టం అన్న కార్యక్రమాన్ని ఆదివారం గ్రంథాలయ అధికారి సి హెచ్ కృష్ణ మూర్తి అధ్వర్యంలో జరగింది. ఈ కార్యక్రమంలో పిల్లలచేత పుస్తక పఠనం చేయించారు. అలాగే నీతి కథలు రామాయణ భాగవతాలు వంటి పుస్తకాలను చదివించారు. హాస్య కథలు తోపాటు పిల్లలకు క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఖాళీ సమయంలో గ్రంథాలయానికి వచ్చి నచ్చిన పుస్తకాలను చదవాలని కోరారు. కార్య క్రమంలో ఆయనతో పాటు క్రాఫ్ట్ ఉపాధ్యాయులు కె వి స్సు. పిల్లలు పాఠకులు తదితరులు పాల్గొన్నారు.



## 'వివేకానంద'లో అన్నదానం ప్రారంభించి 25 ఏళ్ళు పూర్తి

### ఘనంగా మహా రక్తదాన శిబిరం, మహా అన్నదాన కార్యక్రమం

### -హాజరైన ఎమ్మెల్యే వంశీకృష్ణ, పోలీసు కమిషనర్ బాగ్చీ





విశాఖపట్నం, మార్చి 9, మేజర్‌న్యూస్

శ్రీ స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ.. అన్నదానం ప్రారంభించి 25 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా లయన్స్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆదివారం వన్‌టౌన్‌లో వున్న సంస్థ కార్యాలయంలో మహా రక్తదాన శిబిరాన్ని, మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వంశీకృష్ణ యాదవ్, నగర పోలీస్ కమిషనర్ బాగ్చి హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ రక్తదాన శిబిరంలో 45 మంది రక్తదాతలు రక్తాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ, వివేకానంద సంస్థ చాలా మంచి సేవా కార్యక్రమాలు చేస్తున్నారని, సంస్థ అభివృద్ధికి తమ సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని తెలియజేశారు. పోలీస్ కమిషనర్ బాగ్చి మాట్లాడుతూ, నగరంలో రక్తం కొరత చాలా ఉందని, రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేసిన సంస్థ వారిని, రక్తదాతలందరినీ ఈ సందర్భంగా అభినందించారు. వృద్ధాశ్రమంలో వృద్ధులను సొంత తల్లిదండ్రుల వలె సంరక్షిస్తూ, గొప్ప గొప్ప కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, వివేకానంద సంస్థకు ఆయన సలహాలు సూచనలను అందించారు. పదవ తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న 10వ తరగతి విద్యార్థులకు ప్లాంకులను, పెన్నుల సెట్స్ అందించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లీడర్ పత్రిక వ్యవస్థాపకులు రమణ మూర్తి, ప్రముఖ సంఘ సేవకులు హనుమంతరావు, ద్రోణంరాజు శ్రీవత్సవ, వివేకానంద సంస్థ గౌరవ అధ్యక్షులు డాక్టర్ జహీర్ అహ్మద్, 39వ వార్డు కార్పొరేటర్ సాధిక్, శ్రీకనకమహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానం మాజీ ఛైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, కార్పొరేటర్ కందుల నాగరాజు, జనప్రియ వేణు తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు సూరాడ అప్పారావు, సంస్థ గౌరవ సలహాదారులు పోతురాజు, సభ్యులు శీరం శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## బచేలి-కిరండూల్ సెక్షన్ డబుల్ నిర్మాణం.. ఒక ముఖ్యమైన మైలురాయి





విశాఖపట్నం, మార్చి 9, మేజర్‌న్యూస్

ఈస్ట్ కోస్ట్ రైల్వేలోని వాల్తేరు డివిజన్ ఆదివారం 9.143 కిలోమీటర్ల బచేలి-కిరండూల్ సెక్షన్ డబ్లింగ్‌ను ప్రారంభించడంతో ఒక ముఖ్యమైన మైలురాయిని సాధించింది. దీనికి రైల్వే సేఫ్టీ కమిషనర్ (సౌత్ ఈస్టర్న్ సర్కిల్) బ్రిజేష్ కుమార్ మిశ్రా ఆదేశాల మేరకు.. కఠినమైన భద్రతా చర్యల కింద తనిఖీ చేపట్టారు. ఈ ప్రాంత అభివృద్ధికి కీలకమైన రైల్వే మౌలిక సదుపాయాలలో గణనీయమైన మెరుగుదలను పేర్కొన్నారు. డివిజనల్ రైల్వే మేనేజర్ వాల్టేర్ శ్రీ లలిత్ బోహ్రాబీ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (నిర్మాణం) గౌతమ్ శ్రీనివాస్, చీఫ్ ఇంజనీర్ (ట్రాక్) కె ధనుంజయ రావు, చీఫ్ ఇంజనీర్ (నిర్మాణం) గౌరీశంకర్ రావు, చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (నిర్మాణం) మంజిత్ సింగ్ సంసన్వాల్, చీఫ్ సిగ్నల్, టెలికాం ఇంజనీర్ (నిర్మాణం) కెఎస్ వర్మ, డిప్యూటీ సీఆర్ఎస్ అసుతోష్ కుమార్, రైల్వే భద్రతా కమిషనర్ ఇతర సీనియర్ అధికారులు కార్యాచరణ భద్రత, సామర్థ్యం కోసం కీలకమైన సమగ్ర తనిఖీలు, ట్రయల్స్‌ను పర్యవేక్షించారు. ఈ తనిఖీలలో మోటారు ట్రాలీలపై ట్రాక్ అసెస్‌మెంట్‌లు, బచేలి- కిరండూల్ రైల్వే స్టేషన్‌ల మూల్యాంకనాలు, కొత్త సిగ్నలింగ్ వ్యవస్థల పరిశీలన, కొత్తగా నిర్మించిన వంతెనల పరిశీలించారు. కొత్తగా వేసిన లైన్‌లో స్పీడ్ ట్రయల్ విజయవంతంగా నిర్వహించబడింది, కార్యాచరణ విస్తరణకు సంసిద్ధతను ధృవీకరిస్తుంది. ఛత్తీస్‌గఢ్‌లోని బచేలి-కిరండూల్ ప్రాంతంలో ఈ డబ్లింగ్ ప్రాజెక్టు పూర్తి కావడం వాల్తేర్ డివిజన్‌కు వ్యూహాత్మక పురోగతి. భద్రతా కారణాల వల్ల సవాలు చేయబడిన ఈ విభాగం, ఇప్పుడు బైలాడిలా గనుల నుండి దేశంలోని వివిధ ప్రాంతాలకు ఇనుప ఖనిజాన్ని సజావుగా రవాణా చేయడానికి మెరుగైన సామర్థ్యాన్ని కలిగి ఉంది. అప్‌గ్రేడ్ చేయబడిన మౌలిక సదుపాయాలు పెరిగిన ట్రాఫిక్ డిమాండ్లకు మద్దతు ఇవ్వడమే కాకుండా ప్రాంతీయ ఆర్థిక వృద్ధికి కీలకమైన కనెక్టివిటీని కూడా బలోపేతం చేస్తాయి. 9.143 కిలోమీటర్ల సెక్షన్ డబ్లింగ్ విజయవంతంగా ప్రారంభించడం ఈ ప్రాంతంలో రైలు కనెక్టివిటీ, కార్యాచరణ సామర్థ్యాన్ని పెంచడంలో తమ నిబద్ధతను పేర్కొన్నారు.

## నేటి నుంచి యథావిధిగా పీజీఆర్ఎస్

### జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, మార్చి 9, మేజర్‌న్యూస్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) వినతుల స్వీకరణ కార్యక్రమం 10వ తేదీ సోమవారం నుంచి యథావిధిగా జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ తెలిపారు. ఎన్నికల కోడ్ కారణంగా గత కొన్ని వారాల నుంచి రద్దైన సంగతి తెలిసిందే.. కోడ్ ముగిసిన క్రమంలో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని పునఃప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల, జిల్లా స్థాయి అధికారులు సంబంధిత ఏర్పాట్లు చేసుకోవాలని, ప్రజల నుంచి వినతులు తీసుకోవాలని ఆదివారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 9.30 గంటల నుంచి వినతుల స్వీకరణ కార్యక్రమం మొదలవుతుందని, అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు వినతులు సమర్పించవచ్చని సూచించారు.